RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
# మహి న్యూస్
MAHI NEWS
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
మహి న్యూస్
ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
-: సంప్రదించండి :-
9059585898

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 02 సంచిక : 62, ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజీలు : 8, వెల రూ. 2, /- గురువారం -04 - జూన్ - 2026
published From : YSR Kadapa. circulated by Kurnool I Anantapuram I Chitoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad and Telangana



## తెలంగాణపై నా నిబద్ధత ఈనాటిది కాదు: పవన్

- 2009లో ప్రజారాజ్యం పార్టీ యువరాజ్యం విభాగానికి నాయకత్వం వహిస్తున్నప్పుడు.. ఉస్మానియా విద్యార్థి నేతలు, గద్దర్‌తో కలిసి తెలంగాణ సామాజిక న్యాయసభలో పాల్గొన్నా
- తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు బహిరంగంగా మద్దతు తెలిపా
- నాటి తన నిర్ణయమే తెలంగాణ పట్ల తనకున్న అచంచల నిబద్ధతకు నిదర్శనం

## గొడ్డలి పార్టీకి విధ్వంసం తప్ప
# ఏమీ చేతకాదు

### డీఎస్సీ నియామకాలు అత్యంత పారదర్శకంగా జరిగాయని చంద్రబాబు స్పష్టీకరణ

- సీఎం చంద్రబాబు ఫైర్
- పేటీఎం బ్యాచ్‌లతో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపణ
- యోగాంధ్ర కార్యక్రమానికి నిధుల కేటాయింపుపై విమర్శలను తప్పుబట్టిన సీఎం
- ప్రజలకు మంచి చేయడంలో పోటీ పడాలని రాజకీయ పార్టీలకు పిలుపు



అమరావతి: ప్రత్యర్థి పార్టీకి విమర్శలు, విధ్వంసం తప్ప మరేమీ చేతకాదని, వారిని గొడ్డలి పార్టీగా అభివర్ణిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అమరావతిలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు మిగతా 2 లో

## 2027 గోదావరి పుష్కరాలు చరిత్రలో నిలిచిపోవాలి: చంద్రబాబు

- 2027 గోదావరి పుష్కరాలను అట్టహాసంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని వెల్లడి







## ఆరోగ్యమే అసలైన సంపద.. జీవనశైలి మార్చుకోవాలి

### అమరావతిని గ్లోబల్ హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటన

గుంటూరులో లలితా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించిన సీఎం చంద్రబాబు

- సంజీవని ప్రాజెక్టు, యూనివర్సల్ హెల్త్ పాలసీ వివరాలు వెల్లడి
- గత ప్రభుత్వంలో నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతిన్నదని విమర్శ
- ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ప్రజలకు సూచన

అమరావతి: రాజధాని అమరావతిని భవిష్యత్తులో ప్రపంచస్థాయి ఆరోగ్య కేంద్రంగా (గ్లోబల్ హెల్త్ హబ్) తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. గతంలో హైదరాబాద్‌లో హెల్త్ టూరిజాన్ని ప్రోత్సహించిన మిగతా 2 లో


## సీఎం రేవంత్‌తో దక్షిణాఫ్రికా
# డిప్యూటీ ప్రెసిడెంట్ భేటీ

### తెలంగాణలో పెట్టుబడులు, వాణిజ్యంపై ప్రధానంగా చర్చలు



- ఐటీ, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో సహకారానికి అంగీకారం
- పెట్టుబడులకు పూర్తి సహకారం అందిస్తామని సీఎం రేవంత్ హామీ

హైదరాబాద్: తెలంగాణ, దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా కీలక అడుగుపడింది. బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ షిపోకోసా పౌలస్ మషాటిలే మిగతా 2 లో




## వాట్సప్ కాల్స్ రికార్డ్ అవాస్తవం.. సోషల్‌మీడియా పోస్ట్‌పై సజ్జనర్

- సోషల్ మీడియాలో విస్తృతంగా సర్క్యులేట్ అవుతున్న ఈ సందేశం పూర్తిగా అవాస్తవం
- ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకు కొందరు ఆకతాయిలు ఇలా చేస్తున్నారు
- తప్పుడు వార్తలు వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం
- ఇదే విషయమై గతంలో పలుమార్లు అప్రమత్తం చేశాం



## తెలంగాణ నాలుగు కోట్ల
# మంది జాగీర్

### పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు కేటీఆర్ కౌంటర్

- తెలంగాణ ఇక్కడి భూమిపుత్రుల జాగీరని వ్యాఖ్య
- పవన్ ఎక్కడైనా పోటీ చేసుకోవచ్చన్న కేటీఆర్
- కానీ, సెక్రటేరియట్‌లో పెత్తనం చేస్తామంటే ఊరుకునేది లేదన్నారు.

హైదరాబాద్: తెలంగాణ ఇక్కడున్న నాలుగు కోట్ల మంది భూమి పుత్రుల జాగీరని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు మిగతా 2 లో

## తెలంగాణకు వర్ష సూచన.. 18 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్




- తెలంగాణలోని పలు జిల్లాలకు వర్ష సూచన
- 18 జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు

### విశాఖ ఫార్మా, వ్యవసాయ ఎగుమతిదారులకు
## ప్రత్యేక రుణాలు అందించాలి


### లోకేష్ ప్రతిపాదనలను పరిశీలిస్తామని తెలిపిన బ్యాంక్ యాజమాన్యం



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ రష్యా పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రభుత్వ నియంత్రణలోని అతిపెద్ద రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్బేర్‌బ్యాంక్‌తో కీలక చర్చలు జరిపారు. మాస్కోలో స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్‌తో భేటీ అయిన లోకేష్, భారత్‌లో బ్యాంకింగ్, టెక్నాలజీ, స్మార్ట్ సిటీ రంగాలలో సహకారానికి సంబంధించి పలు ముఖ్యమైన ప్రతిపాదనలు చేశారు. ఈ సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ... స్బేర్‌బ్యాంక్ అభివృద్ధి చేసిన 'గిగాచాట్ ఎల్ఎల్ఎం'ను భారత బ్యాంకింగ్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రిటైల్ రంగాలకు విస్తరించాలని మిగతా 2 లో

## నెహ్రూ రికార్డు బద్దలు.. సుదీర్ఘకాలం పాలించిన ప్రధానిగా మోదీ సరికొత్త చరిత్ర!

- జూన్ 10 నాటికి ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకోనున్న మోదీ
- 4,398 రోజుల పాటు పాలించిన నేతగా ఇప్పటి వరకు నెహ్రూ పేరిట రికార్డు
- 4,077 రోజులు అధికారంలో ఉన్న ఇందిరా గాంధీ
- అత్యధిక కాలం అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధిగా ఇప్పటికే మోదీ పేరిట రికార్డు




ఢిల్లీ: భారత రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో అరుదైన మైలురాయిని అందుకోనున్నారు. దేశంలో అత్యంత సుదీర్ఘకాలం పాటు నిరంతరాయంగా పాలించిన ప్రధానిగా మిగతా 2 లో

## రూ.60 వేల కోట్ల
# భూములు స్వాధీనం



హైదరాబాద్: 'రాష్ట్రంలో ప్రజలు రాచరిక ఆలోచనలు, నియంతృత్వ పోకడలను ఓడించి ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించుకున్నారు. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికలు, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో సైతం ఆదరాభిమానాలు చూపడం మాకు ఎనలేని శక్తిని ఇచ్చిందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. మేం పాలకులుగా కాకుండా సేవకులుగా బాధ్యత నిర్వర్తిస్తున్నాం. క్యూర్ ఏరియాలో ప్రభుత్వ భూములు, చెరువుల్లో కబ్జాలను తొలగించడం ద్వారా రూ.60 వేల కోట్ల విలువైన 1,045 ఎకరాలకు పైగా భూములను హైడ్రా స్వాదీనం చేసుకుంది. మెట్రో రైలు కొనుగోలు చేసి ప్రజల ఆస్తిగా మార్చాం. ఫేజ్--1 కింద మూసీ ప్రక్షాళన ప్రారంభించాం. 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని మిగతా 2 లో

## కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం




మీ కొత్త బాధ్యతను సమర్థంగా నిర్వహించండి"

బెంగళూరు: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డీకే శివకుమార్ బెంగళూరులోని లోక్ భవన్‌లో కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ప్రమాణ స్వీకారం చేయించారు. మరో 13 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

### రష్యా-ఆఫ్ఘనిస్థాన్ మధ్య కీలక రక్షణ ఒప్పందం..
# పాకిస్థాన్‌కు కొత్త తలనొప్పులు!

ఢిల్లీ: అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఆఫ్ఘనిస్థాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వంతో రష్యా తన మొట్టమొదటి అధికారిక సైనిక-సాంకేతిక సహకార ఒప్పందాన్ని కుదుర్చుకుంది. మాస్కోలో జరిగిన అంతర్జాతీయ భద్రతా సదస్సులో ఆఫ్ఘన్ రక్షణ మంత్రి ముహమ్మద్ యాకూబ్, రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగు ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా తాలిబాన్లకు ఆయుధాల సరఫరా, సైనిక సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, శిక్షణ, సంయుక్త ప్రాజెక్టులు చేపట్టే అవకాశం ఉంది. గతంలో తాలిబాన్లను ఉగ్రవాదులుగా పరిగణించిన రష్యా, 2025లో తాలిబాన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించిన మొదటి దేశంగా నిలిచింది. ఇప్పుడు ఏకంగా వ్యూహాత్మక భద్రతా భాగస్వామిగా మారడం గమనార్హం. మాస్కోపై జరిగిన 'క్రాకస్ సిటీ హాల్' దాడి తర్వాత ఐసిస్-కె ఉగ్రవాద సంస్థను అణచివేయడం రష్యాకు అత్యంత కీలకంగా మారింది. అలాగే, 2021లో అమెరికా నిష్క్రమణ తర్వాత ఏర్పడిన శూన్యతను భర్తీ చేస్తూ మధ్య ఆసియాలో తన పట్టును నిలుపుకోవాలని రష్యా భావిస్తోంది. ఈ రక్షణ ఒప్పందం పాకిస్థాన్‌కు తీవ్ర కలవరాన్ని కలిగిస్తోంది. ఇటీవలి కాలంలో సరిహద్దు ఘర్షణలు, టీటీపీ (తెహ్రీక్ ఇ తాలిబాన్ పాకిస్థాన్) ఉగ్రవాదులకు ఆఫ్ఘన్ ఆశ్రయం కల్పిస్తోందనే పాక్ ఆరోపణల వల్ల తాలిబాన్-పాక్ సంబంధాలు క్షీణించాయి. ఇప్పుడు తాలిబాన్లకు రష్యా ఆయుధాలు అందిస్తే అది ఇస్లామాబాద్‌కు ప్రత్యక్ష భద్రతా సవాలుగా మారుతుంది. ఇది భారత్‌కు సానుకూల పరిణామంగా విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు చైనా ఇప్పటికే ఆఫ్ఘనిస్థాన్‌లోని లిథియం, రాగి వంటి ఖనిజ వనరులపై కన్నేసి తాలిబాన్లతో సంబంధాలను బలపరుచుకుంటోంది. ఈ రష్యా-తాలిబాన్ ఒప్పందం దక్షిణ, మధ్య ఆసియాలో అధికార సమీకరణాలను పూర్తిగా మార్చబోతోంది.

## ఇరాన్‌తో చర్చలు ఆగలేదు: ట్రంప్ స్పష్టత

ఢిల్లీ: ఇరాన్‌తో చర్చలు నిలిచిపోయాయంటూ వస్తున్న వార్తలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ఖండించారు. ఇవి తప్పుడు ప్రచారాలని కొట్టిపారేశారు. ఇరు దేశాల మధ్య సంప్రదింపులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని, ఇటీవలి రోజుల్లో కూడా అవి చురుగ్గా జరిగాయని స్పష్టం చేశారు. చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడిందన్న వాదనలు "తప్పుడు, నిరాధారమైనవి" అని ట్రంప్ అభివర్ణించారు. జూన్ 2వ తేదీన కూడా చర్చలు జరిగాయని తెలిపారు. "గత నాలుగు రోజులు, మూడు రోజులు, నిన్న, ఈరోజు... ఇలా ప్రతిరోజూ మా మధ్య చర్చలు జరుగుతూనే ఉన్నాయి," అని ఆయన తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. చర్చల్లో పురోగతి ఉన్నప్పటికీ, తుది ఒప్పందంపై అనిశ్చితి కొనసాగుతోందని ఆయన అంగీకరించారు. 2025లో అమెరికా, ఇజ్రాయెల్ సైనిక చర్యలు, హోర్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ శాంతి చర్చలు ప్రారంభమయ్యాయి. అయితే, లెబనాన్‌లో ఇజ్రాయెల్ కార్యకలాపాలు వంటి అంశాలపై అసంతృప్తితో చర్చలు ఆగిపోయాయని ఇరాన్ మీడియాలో కథనాలు వచ్చాయి. ఇరాన్ అణు కార్యక్రమం, ఆంక్షల ఉపసంహరణ, హోర్ముజ్ జలసంధిని నౌకా రవాణాకు పూర్తిగా తెరవడం వంటివి ఈ చర్చల్లో కీలక అంశాలుగా ఉన్నాయి. గతంలో చర్చించడానికి ఇష్టపడని అణు అంశాలపై కూడా ఇరాన్ సుముఖత చూపిస్తోందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తెలిపారు. అయితే, ఆమోదయోగ్యమైన ఒప్పందం కుదురుతుందన్న గ్యారెంటీ లేదని ఆయన హెచ్చరించారు.

## ఢిల్లీలో భారీ అగ్ని ప్రమాదం.. 21 మంది సజీవ దహనం

ఢిల్లీ: ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో 21 మంది సజీవ దహనమయ్యారు. అనేక మందికి తీవ్ర గాయాలయ్యాయి. 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు 40 మందిని కాపాడారు. మాలవీయనగర్‌లోని లెమన్ గ్రీన్ రెస్టారెంట్‌లో ఉదయం 9 గంటల సమయంలో మంటలు చెలరేగుతున్నట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు షార్ట్ సర్క్యూట్ కారణంపై ఉండొచ్చని ప్రాథమికంగా నిర్ధారించారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చనిపోయిన వారి కుటుంబాలకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స కోసం రూ.50 వేలు అందజేస్తామన్నారు.

### తెలంగాణకు వర్ష సూచన..
# 18 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

హైదరాబాద్: తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు. ఈ భారీ వర్షాలతో పాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులు సంభవించే ప్రమాదం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరోవైపు, దేశవ్యాప్తంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రేపటిలోగా కేరళ, తమిళనాడు తీరాలను తాకనున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న రాత్రి నుంచే పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రాత్రంతా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. రాబోయే రెండు రోజులు మరిన్ని భారీ వర్షాల సూచన ఉన్నందున, ముఖ్యంగా రైతులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# 2027 గోదావరి పుష్కరాలు చరిత్రలో నిలిచిపోవాలి

అమరావతి: 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను రాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవాన్ని చాటేలా అత్యంత ఘనంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో మంత్రుల కమిటీ, ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తామని, ఇది యాత్రికులకు అదనపు ఆకర్షణగా నిలుస్తుందని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ధవళేశ్వరం నుంచి పోలవరం ప్రాజెక్టు వరకు ఉన్న ప్రాంతాన్ని 'అఖండ గోదావరి కారిడార్'గా అభివృద్ధి చేయాలని సూచించారు. పుష్కరాల కోసం అభివృద్ధి చేసే అన్ని మౌలిక సదుపాయాలు గోదావరి బేసిన్ ప్రాంతానికి శాశ్వత ఆస్తులుగా మారాలని ఆకాంక్షించారు. ఈ పుష్కరాలతో రాజమహేంద్రవరం ఒక ప్రధాన మహానగరంగా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పోలవరం, ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో మొత్తం 525 ఘాట్లను సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పుష్కరాలకు దాదాపు 9.95 కోట్ల మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. యాత్రికుల సౌకర్యార్థం రహదారి, రైల్వే ట్రాఫిక్ నిర్వహణపై దృష్టి పెట్టాలని, పుష్కర ఘాట్లకు క్రమపద్ధతిలో నంబర్లు కేటాయించాలని ఆదేశించారు. ప్రత్యేక రైళ్లు, కేంద్రం నుంచి ఆర్థిక సహాయం కోరుతూ కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాయాలని అధికారులకు సూచించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన క్షేత్రస్థాయి పర్యటన సిఫార్సులను కూడా ప్రణాళికలో చేర్చాలని తెలిపారు. జూన్ 24 నాటికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని, ఆ తర్వాత పుష్కరాలకు అధికారికంగా కౌంట్‌డౌన్ ప్రారంభిస్తామని సీఎం వెల్లడించారు.

# కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం

మొదటి పేజి తరువాయి

మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వారిలో సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర కూడా ఉన్నారు. కర్ణాటక డిప్యూటీ సీఎంగా పరమేశ్వర ప్రమాణ స్వీకారం చేశారు. డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారానికి ముందు పీఠాధిపతుల ఆశీర్వాదం తీసుకున్నారు. డీకే శివకుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తదితరులు హాజరయ్యారు.

### ప్రమాణ స్వీకారం చేసినవారు

డీకే శివకుమార్ , జీ పరమేశ్వర్, కె హెచ్ మునియప్ప, కె జె జార్జ్, ఎం బీ పాటిల్, రామలింగ రెడ్డి, సతీశ్ జరకిహోళి, కృష్ణ బైరెగౌడ, ప్రియాంక్ ఖర్గే,యూటీ ఖాదర్, ఈశ్వర్ ఖండ్రే,యతీంద్ర సిద్ధరామయ్య, బైరతి సురేశ్, శరణ ప్రకాశ్ పాటిల్, లోక్ భవన్‌లో ప్రమాణ స్వీకారం నేపథ్యంలో డీకే శివకుమార్ నివాసం బయట భద్రతను కట్టుదిట్టం చేశారు. శివకుమార్‌ను అభినందిస్తూ నగరమంతా అభిమానులు పోస్టర్లు ఏర్పాటు చేశారు. కర్ణాటక ముఖ్యమంత్రి బాధ్యతల నుంచి తప్పుకున్న సిద్ధరామయ్యకు శివకుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముందే కాంగ్రెస్‌లో కీలక బాధ్యత లభించింది. ఆయనను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా నియమించారు. కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న డీకే శివకుమార్ తన తల్లి గౌరమ్మను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. కాగా, కర్ణాటకలో దీర్ఘకాలంగా సాగిన పోరు తర్వాత డీకే శివకుమార్ ముఖ్యమంత్రి అయ్యారు. కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో 2023 మేలో అధికారంలోకి వచ్చింది.

### సోనియా గాంధీ సందేశం

డీకే శివకుమార్‌కు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. "అందరినీ కలుపుకుని ముందుకు సాగండి. మీరు కర్ణాటకకు విజయవంతంగా నాయకత్వం వహిస్తారనే సంపూర్ణ విశ్వాసం నాకు ఉంది. మీ కొత్త బాధ్యతను సమర్థంగా నిర్వహించండి" అని ఆమె చెప్పారు. అలాగే, పలువురు ప్రముఖులు డీకే శివకుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# రూ.60 వేల కోట్ల భూములు స్వాధీనం

30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని ఏర్పాటు చేస్తున్నాం. శంషాబాద్‌ను బుల్లెట్ రైలు కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. త్వరలో వరంగల్, ఆదిలాబాద్‌లో విమానాశ్రయాల ఏర్పాటు పనులు ప్రారంభిస్తాం. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడానికి రూ.లక్ష కోట్ల జీరో వడ్డీ రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే రూ.60 వేల కోట్ల రుణాలను పంపిణీ చేశాం. రుణ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం. కొత్తగా ఇందిరా మహిళా శక్తి సూపర్ బజార్లు, లాజిస్టిక్ హబ్‌లు, గోదాములు, రైస్ మిల్లులు ఏర్పాటుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఈ మేరకు 8 వేల స్త్రీ శక్తి భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశాం..'అని ముఖ్యమంత్రి తెలిపారు.

13 నెలల్లోనే 1.2 లక్షల ఇళ్లు.. 'రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని గతేడాది ఫిబ్రవరిలో ప్రారంభించి 13 నెలల్లోనే లక్షా 20 వేల ఇళ్లను పూర్తి చేశాం. సెప్టెంబర్ 17 నాటికి మిగతా 2 లక్షల ఇళ్లూ పూర్తి చేస్తాం. రెండో విడతగా క్యూర్ పరిధిలో లక్ష, మిగిలిన ప్రాంతాల్లో 2.5 లక్షలు కలిపి మొత్తం 3.5 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లనూ రెండో విడతలో పూర్తి చేయాలని నిర్ణయించాం. 15.12 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేసి 3.38 కోట్ల మందికి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం. స్కిల్డ్ వర్కర్లకు 25.9 శాతం, అన్ స్కిల్డ్ వర్కర్లకు 34.95 శాతం కనీస వేతనాలు పెంచాం. తెలంగాణ పోరాట యోధులను గుర్తించడానికి కమిటీని నియమించాం. త్వరలో ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అమలు చేయనున్నాం. రాష్ట్రాన్ని 2034 నాటికి ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి తెలంగాణ రైజింగ్ -- 2047 విజన్ డాక్యుమెంట్ ప్రకటించాం. 'తెలంగాణ భూమి నైసర్గిక స్వరూపం అన్ని రకాల పంటలు పండించడానికి అనుకూల క్షేత్రం. రైతులు కొన్ని పంటలకే పరిమితం కాకుండా అన్ని రకాల పంటలు, కూరగాయలు, పండ్లు పండించి తెలంగాణ కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచానికి చాటి చెప్పాలి..'అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. దేశంలోనే కాదు.. ప్రపంచానికే తెలంగాణను గేట్‌వేగా నిలబెట్టాలన్నది తన స్వప్నమని చెప్పారు. '2025--26లో 236.87 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి జరిగింది. రెండున్నరేళ్లలో ధాన్యం కొనుగోళ్లకు రూ.82,840 కోట్లు ఖర్చు చేశాం. యాసంగిలో 8,575 కొనుగోలు కేంద్రాల ద్వారా 63.65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.11,903 కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం. 10 వేల మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేశాం. దేశంలో యాసంగిలో సేకరించిన మొత్తం ధాన్యంలో తెలంగాణ వాటా 60% కావడం గర్వకారణం. యాసంగిలో 16 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 4 లక్షల ఎకరాల్లో జొన్న సాగుతో రైతులు చరిత్ర సృష్టించారు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం..'అని సీఎం చెప్పారు.

### విశాఖ ఫార్మా, వ్యవసాయ ఎగుమతిదారులకు
# ప్రత్యేక రుణాలు అందించాలి

మొదటి పేజి తరువాయి

భారత బ్యాంకింగ్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రిటైల్ రంగాలకు విస్తరించాలని కోరారు. పాశ్చాత్య ప్లాట్‌ఫారమ్‌లకు ఇది ఒక సురక్షితమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, దేశంలోని యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) నెట్‌వర్క్ భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు, స్బేర్‌బ్యాంక్ యొక్క అత్యాధునిక వాయిస్ రికగ్నిషన్, బయోమెట్రిక్ యాంటీ-ఫ్రాడ్ నెట్‌వర్క్‌ను భారత బ్యాంకింగ్ వ్యవస్థలో ఇంటిగ్రేట్ చేయడానికి సాంకేతిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. భారత్‌లో కొనసాగుతున్న స్మార్ట్ సిటీ మిషన్‌లో భాగంగా మున్సిపల్ కార్యకలాపాలను మెరుగుపరచడానికి స్బేర్‌బ్యాంక్ ప్రిడిక్టివ్ అనలిటిక్స్, స్మార్ట్ ట్రాన్సిట్ సర్వైలెన్స్ వంటి డిజిటల్ పరిష్కారాలను అందించాలని లోకేష్ సూచించారు. ప్రపంచస్థాయి సాఫ్ట్‌వేర్, ఏఐ ఇంజనీర్లను వేగంగా తీర్చిదిద్దేందుకు స్బేర్‌బ్యాంక్ యొక్క ప్రత్యేక శిక్షణా విధానమైన 'స్కూల్ 21' కోడింగ్ అకాడమీలను భారత్‌లోని ప్రధాన విద్యా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యంగా, వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలోని ఫార్మా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిదారుల సౌలభ్యం కోసం రూపాయి-రూబుల్ వాణిజ్యానికి అనుమతులు ఇవ్వడంతో పాటు, వ్యవస్థీకృత రుణాలు అందించాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో తమ కార్యకలాపాలను వివరిస్తూ, న్యూఢిల్లీలోని కార్యాలయం ద్వారా ద్వైపాక్షిక వాణిజ్య ఫైనాన్స్, కార్పొరేట్ బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. బెంగళూరులోని తమ ఐటీ హబ్, రూపాయి-రూబుల్ వాణిజ్య లావాదేవీలకు సమన్వయ కేంద్రంగా పనిచేస్తోందని చెప్పారు. న్యూఢిల్లీ, ముంబైలోని తమ శాఖలు వ్యూహాత్మక వాణిజ్య కారిడార్లలో మౌలిక సదుపాయాల పెట్టుబడులకు గేట్‌వేలుగా ఉన్నాయని వివరించారు. మంత్రి లోకేష్ చేసిన ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించి, సానుకూల నిర్ణయం తీసుకుంటామని యెఫిమోవ్ హామీ ఇచ్చారు. మాస్కో కేంద్రంగా పనిచేస్తున్న స్బేర్‌బ్యాంక్, రిటైల్ బ్యాంకింగ్‌తో పాటు క్లౌడ్ సేవలు, కృత్రిమ మేధ (ఏఐ) రంగాల్లో విస్తరించిన భారీ సంస్థ. ప్రపంచవ్యాప్తంగా 11 కోట్లకు పైగా రిటైల్, 35 లక్షల కార్పొరేట్ ఖాతాదారులను కలిగి ఉన్న ఈ బ్యాంకు, 12,000 శాఖలతో ప్రతిరోజూ 8 కోట్ల మంది డిజిటల్ వినియోగదారులకు సేవలందిస్తోంది.

### ఆరోగ్యమే అసలైన సంపద..
# జీవనశైలి మార్చుకోవాలి

మొదటి పేజి తరువాయి

గతంలో హైదరాబాద్‌లో హెల్త్ టూరిజాన్ని ప్రోత్సహించిన విధంగానే రాబోయే రోజుల్లో ప్రపంచ నలుమూలల నుంచి రోగులు అమరావతికి వచ్చి చికిత్స పొందే పరిస్థితిని కల్పిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గుంటూరులో నూతనంగా ఏర్పాటు చేసిన లలితా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న అనంతరం ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. గుంటూరులో 600 పడకలతో, 32 విభాగాలతో అత్యాధునిక వసతులతో లలితా ఆసుపత్రిని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా, దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా ఆధునిక ఎమ్ఆర్ఐ స్కాన్‌ను ఇక్కడ ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. "ఒక బ్రాండ్‌కు విలువలు, ప్రజల్లో విశ్వసనీయత తోడైతే దానికి తిరుగుండదు. దశాబ్దాలుగా వైద్య రంగంలో ఉన్న లలితా గ్రూప్ అందుకు నిదర్శనం" అని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆరోగ్య రంగాన్ని సమూలంగా మారుస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు 'సంజీవని' ప్రాజెక్టును తీసుకొచ్చాం. దీని ద్వారా ప్రతి ఒక్కరి డిజిటల్ హెల్త్ రికార్డులు నిర్వహిస్తాం. వ్యాధి రాకముందే గుర్తించడం (ప్రిడిక్టివ్), రాకుండా నివారించడం (ప్రివెంటివ్), వచ్చాక నయం చేయడం (క్యూరేటివ్) అనే త్రిముఖ వ్యూహంతో పనిచేస్తాం. ఇంటి వద్దకే వచ్చి 42 రకాల వైద్య పరీక్షలు చేస్తాం" అని వివరించారు. రాష్ట్రంలో 'యూనివర్సల్ హెల్త్ పాలసీ'ని అమలు చేసి, ప్రతి కుటుంబానికి రూ.2.5 లక్షల వరకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆరోగ్యమే అసలైన సంపద అని, ఆరోగ్యకరమైన పౌరులే సంపన్న దేశాన్ని నిర్మిస్తారని చంద్రబాబు అన్నారు. మంచి ఆహారం, వ్యాయామం, యోగా, ప్రాణాయామం వంటివి జీవనశైలిలో భాగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. "మన వంటిల్లే మన ఫార్మసీ. మనం తినే ఆహారమే మనకు రక్ష. కానీ ఈ రోజుల్లో రసాయనిక ఎరువులు, క్రిమిసంహారకాల వాడకం పెరిగిపోయింది," అని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నాసిరకం మద్యం విక్రయించి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడారని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఎన్ని ఆసుపత్రులు కట్టినా, ప్రజల జీవనశైలిలో మార్పు రానంత వరకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం కాదని హితవు పలికారు.

# తెలంగాణ నాలుగు కోట్ల మంది జాగీర్

మొదటి పేజి తరువాయి

బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అయితే, ఇక్కడికి ఎవరైనా రావొచ్చని స్పష్టం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణకు వస్తే అడ్డుకుంటామని ఎవరూ చెప్పలేదని పేర్కొన్నారు. అయితే తెలంగాణ ఆవిర్భావం రోజు హైదరాబాద్‌లో సభ పెడతానంటే ఎలా? అని ప్రశ్నించారు. "తెలంగాణ మీ అయ్య జాగీరా?" అంటూ మంగళవారం పవన్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రాంతీయవాదం.. ఉగ్రవాదం కంటే ప్రమాదం అన్న పవన్ వ్యాఖ్యలను కేటీఆర్ తప్పుబట్టారు. మద్రాస్ నుంచి వేర్పాటు కోసం ఆత్మబలిదానం చేసిన పొట్టి శ్రీరాములుది కూడా ప్రాంతీయవాదమేనా అని ప్రశ్నించారు. తెలంగాణకు వస్తున్న అనేక పరిశ్రమలను ప్రధాని మోదీ తన స్వరాష్ట్రం గుజరాత్‌కు తరలించుకుపోతున్నారని కేటీఆర్ ఈ సందర్భంగా ఆరోపించారు. "జాతీయవాదం ముసుగులో మోదీ చేస్తున్న ఆర్థిక ప్రాంతీయవాదాన్ని ఏమంటారు?" అని ప్రశ్నించారు. దేశంలో ఎవరైనా ఎక్కడైనా పార్టీ పెట్టుకోవచ్చని కేటీఆర్ అన్నారు. అలాగే ఎక్కడైనా పోటీ చేసే హక్కు ఉందని తెలిపారు. జనసేన కొత్తగా పోటీ చేసేదేముందని.. 2018, 2023లో జనసేన తెలంగాణలో పోటీ చేయలేదా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడినప్పుడు 11 రోజులు అన్నం తినలేదన్న పవన్ వ్యాఖ్యలను ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. అదే వ్యక్తి మళ్లీ తెలంగాణకు వ్యతిరేకం కాదంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణకు 'ఓజీ' కేసీఆర్ అని.. ఇంకెవ్వరూ అవసరం లేదన్నారు. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌ను గౌరవిస్తామని కేటీఆర్ అన్నారు. సోదరుడిగా ఇంటికొస్తే బిర్యానీ పెడతామని వ్యాఖ్యానించారు. సినీ నటుడిగా, కళాకారుడిగా అభిమానిస్తాం. కానీ, సెక్రటేరియట్‌లోకి వచ్చి పెత్తనం చేస్తామంటే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు.

### తెలంగాణ ఎన్నారైలకు అలర్ట్ ఓటర్ ఐడీకి
# మొబైల్ నంబర్ లింక్ తప్పనిసరి!

హైదరాబాద్ : హైదరాబాద్ సహా తెలంగాణకు చెందిన ప్రవాస భారతీయులు (ఎన్నారైలు) తమ ఓటర్ ఐడీకి మొబైల్ నంబర్‌ను తప్పనిసరిగా లింక్ చేసుకోవాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. జూన్ 15 నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) నేపథ్యంలో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించింది. మొబైల్ నంబర్ లింక్ లేకపోతే, ఎన్నారైలు ఆన్‌లైన్‌లో తమ వివరాలను సమర్పించడం సాధ్యం కాదని, ఓటర్ల జాబితాలో చేరడంలో ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులు తెలిపారు. ఎన్నారైలు తమ మొబైల్ నంబర్‌ను లింక్ చేయడానికి ఈసీఐ అధికారిక పోర్టల్ జశేవతీం.వఎఱ.స్ త్రశీజ.ఱఅ ను సందర్శించాలి. అక్కడ ఫారం 8 (ప్రస్తుత ఓటర్ల జాబితాలో వివరాల సవరణ)ను పూర్తి చేయాలి. మొబైల్ నంబర్ నమోదు చేశాక వచ్చే ఓటీపీతో ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా, ఓటర్ ఐడీ కార్డులో ఉన్న పేరు, ఆధార్ కార్డులో ఉన్న పేరు ఒకేలా ఉండటం తప్పనిసరి అని, ఫారం సమర్పించేటప్పుడు ఆధార్ అథెంటికేషన్ అవసరమని అధికారులు నొక్కిచెప్పారు. తెలంగాణలో జరగనున్న ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి ఇటీవల ప్రకటించారు. దీని ప్రకారం, జూన్ 15 నుంచి 24 వరకు ఓటర్ల జాబితా రూపకల్పన, జూన్ 25 నుంచి జూలై 24 వరకు క్షేత్రస్థాయి పరిశీలన జరుగుతుంది. అభ్యంతరాలను ఆగస్టు 30 వరకు స్వీకరించి, అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. విదేశాల్లో నివసిస్తున్నప్పటికీ, తమ ఓటు హక్కును కాపాడుకోవాలనుకునే ప్రవాస భారతీయులకు ఈ ప్రక్రియ చాలా కీలకం. నిర్ణీత గడువులోగా తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవడం ద్వారా వారు తమ రాష్ట్రంలోని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములుగా కొనసాగవచ్చు.

## సీఎం రేవంత్‌తో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ భేటీ

హైదరాబాద్: తెలంగాణ, దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా కీలక అడుగుపడింది. బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ షిపోకోసా పౌలస్ మషాటిలే బృందం సమావేశమైంది. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన ఈ భేటీలో ఇరుపక్షాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య అవకాశాలపై ప్రధానంగా చర్చించారు. సమాచార సాంకేతికత (ఐటీ), ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం వంటి కీలక రంగాల్లో పరస్పర సహకారంపై చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే దక్షిణాఫ్రికా కంపెనీలకు, పారిశ్రామికవేత్తలకు పూర్తి మద్దతు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) హైదరాబాద్ కేంద్రంగా మారిందని, ప్రపంచస్థాయి వైద్య సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో జరగనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు దక్షిణాఫ్రికా ప్రతినిధి బృందాన్ని సీఎం ఆహ్వానించారు. ఈ సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనరసింహ కూడా పాల్గొన్నారు. భారత్, దక్షిణాఫ్రికా మధ్య చారిత్రక బంధం ఉందని డిప్యూటీ ప్రెసిడెంట్ మషాటిలే గుర్తుచేశారు. ఆఫ్రికన్ కాంటినెంటల్ ఫ్రీ ట్రేడ్ ఏరియా ద్వారా తెలంగాణ కంపెనీలకు విస్తృత మార్కెట్ అవకాశాలు లభిస్తాయని, ముఖ్యంగా ఫార్మా రంగంలో స్థానికంగా ఉత్పత్తి భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తామని ఆయన తెలిపారు.

### నెహ్రూ రికార్డు బద్దలు.. సుదీర్ఘకాలం
# పాలించిన ప్రధానిగా మోదీ సరికొత్త చరిత్ర!

ఢిల్లీ: భారత రాజకీయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరో అరుదైన మైలురాయిని అందుకోనున్నారు. దేశంలో అత్యంత సుదీర్ఘకాలం పాటు నిరంతరాయంగా పాలించిన ప్రధానిగా జూన్ 10న ఆయన సరికొత్త రికార్డు సృష్టించనున్నారు. స్వతంత్ర భారతదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పేరిట ఉన్న దశాబ్దాల నాటి రికార్డును మోదీ అధిగమించనున్నారు. 2014 మే 26న తొలిసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన మోదీ.. జూన్ 10 నాటికి వరుసగా 4,399 రోజుల పాలనను పూర్తి చేసుకోనున్నారు. దేశంలో మొదటి సాధారణ ఎన్నికల తర్వాత 1952 మే 13న నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన 1964 మే 27న మరణించే వరకు వరుసగా 4,398 రోజుల పాటు ఆ పదవిలో కొనసాగారు. ఇప్పుడు ఆ రికార్డును మోదీ దాటనున్నారు. అంతకుముందు 2025 జులై 25న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పేరిట ఉన్న 4,077 రోజుల నిరంతరాయ పాలన రికార్డును మోదీ దాటేశారు. నెహ్రూ కాలంతో పోలిస్తే ప్రస్తుతం దేశ జనాభా, ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. తొలి సాధారణ ఎన్నికల సమయంలో దేశ జనాభా 34 కోట్లుగా ఉండగా ఓటర్లు 17 కోట్లు మాత్రమే. మోదీ ప్రధాని అయ్యే నాటికి జనాభా 131 కోట్లకు చేరి ప్రస్తుతం 146 కోట్లు దాటింది. అలాగే 1952 ఎన్నికల్లో కేవలం 53 పార్టీలు పోటీ చేయగా.. 2024 లోక్‌సభ ఎన్నికల నాటికి పోటీ చేసిన పార్టీల సంఖ్య ఏకంగా 744కు చేరింది. నెహ్రూ తర్వాత వరుసగా మూడుసార్లు లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన ఏకైక ప్రధానిగా మోదీ నిలిచారు. కాంగ్రెసేతర ప్రధానిగా వరుసగా రెండుసార్లు పూర్తి మెజారిటీ సాధించిన రికార్డు కూడా ఆయనదే. గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా కలిపి అత్యధిక కాలం (8,930 రోజులకు పైగా) అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధిగా ఇప్పటికే మోదీ రికార్డు సృష్టించారు.

## గొడ్డలి పార్టీకి విధ్వంసం తప్ప ఏమీ చేతకాదు

అమరావతి: ప్రత్యర్థి పార్టీకి విమర్శలు, విధ్వంసం తప్ప మరేమీ చేతకాదని, వారిని గొడ్డలి పార్టీగా అభివర్ణిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అమరావతిలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టారు. ఆరోగ్యకరమైన రాజకీయాలు చేయలేని వారిని ప్రజలే బహిష్కరించాలని పిలుపునిచ్చారు. డీఎస్సీ నియామకాలపై వస్తున్న విమర్శలపై చంద్రబాబు స్పందిస్తూ, "డీఎస్సీ ద్వారా ఉద్యోగాల భర్తీకి టీడీపీ ఒక బ్రాండ్. అధికారంలోకి రాగానే తొలి సంతకంతో పారదర్శకంగా నియామకాలు చేపట్టాం. స్పోర్ట్స్ కోటాపై కనీస అవగాహన లేకుండా అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే కేటగిరీలు నిర్ణయించి ఉద్యోగాలు ఇచ్చాం" అని వివరించారు. కొందరు తమ పేటీఎం బ్యాచ్‌ల ద్వారా ప్రభుత్వంపై లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. బాధ్యత కలిగిన రాజకీయ పార్టీలు ఏ అంశంపైనైనా మాట్లాడే ముందు అధ్యయనం చేయాలని హితవు పలికారు. "యోగాంధ్ర కార్యక్రమం కోసం రూ.10 కోట్లు కేటాయిస్తే దానిపైనా విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏ నిర్మాణాత్మక నిర్ణయం తీసుకున్నా బురద చల్లడమే పనిగా పెట్టుకున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విభజన జరిగి 12 ఏళ్లు గడిచిపోయిందని, ఈ సమయంలో ప్రజలకు ఎవరు మంచి చేశారో అందరికీ తెలుసని చంద్రబాబు అన్నారు. అనవసర వివాదాలు సృష్టించడం మానుకుని, ప్రజలకు మేలు చేయడంలో రాజకీయ పార్టీలు పోటీ పడాలని ఆయన సూచించారు.

## తెలంగాణపై నా నిబద్ధత ఈనాటిది కాదు: పవన్

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధనపై తన నిబద్ధత ఈ మధ్యే మొదలైంది కాదని జనసేన అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ యువరాజ్యం విభాగానికి నాయకత్వం వహిస్తున్నప్పుడు.. ఉస్మానియా విద్యార్థి నేతలు, గద్దర్‌తో కలిసి తెలంగాణ సామాజిక న్యాయసభలో పాల్గొన్నానని తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఓ వీడియో పోస్ట్ చేశారు. వైఎస్ఆర్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న సమయంలో.. తాను తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు బహిరంగంగా మద్దతు తెలిపానన్నారు. 'సామాజిక తెలంగాణ' కోసం గట్టిగా పిలుపునిచ్చినట్లు తెలిపారు. నాటి తన నిర్ణయమే తెలంగాణ పట్ల తనకున్న అచంచల నిబద్ధతకు నిదర్శనమని స్పష్టం చేశారు.

### వాట్సప్ కాల్స్ రికార్డ్ అవాస్తవం..
# సోషల్‌మీడియా పోస్ట్‌పై సజ్జనర్

హైదరాబాద్: వాట్సప్ కాల్స్ రికార్డ్ అవుతున్నాయంటూ జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని హైదరాబాద్ సీపీ సజ్జనర్ స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో విస్తృతంగా సర్క్యులేట్ అవుతున్న ఈ సందేశం పూర్తిగా అవాస్తవమన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకు కొందరు ఆకతాయిలు ఇలా చేస్తున్నారని తెలిపారు. బాధ్యతగల పౌరులుగా ఇటువంటి ఫేక్ వార్తలను నమ్మొద్దని, ఎవరికీ షేర్ చేయొద్దని సూచించారు. తప్పుడు వార్తలు వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇదే విషయమై గతంలో పలుమార్లు అప్రమత్తం చేశామని, అయినా కొందరు ఉద్దేశపూర్వకంగా దీన్ని షేర్ చేస్తున్నారని మండిపడ్డారు.

పోస్ట్‌లో ఏముందంటే?

వాట్సప్, ఇతర సామాజిక మాధ్యమాలపై ప్రభుత్వం నిఘా పెట్టనుందని ఓ పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లుకొడుతోంది. 'ఇటీవల పరిణామాల దృష్ట్యా రేపటి నుంచి వాట్సప్, ఫోన్ కాల్ నియమాలు అమల్లోకి రానున్నాయి' అనేది ఆ పోస్ట్ సారాంశం. అన్ని కాల్స్ రికార్డు చేస్తారని, వాట్సప్, ఫేస్‌బుక్, ట్విటర్, ఇతర అన్ని సామాజిక మాధ్యమాలపై పర్యవేక్షణ ఉంటుందని ఆ పోస్టులో ఉంది. పలు సందర్భాల్లో ఇదే తరహా సందేశాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతూ వచ్చాయి. అందువల్ల ఇలాంటి సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

### మేలో రికార్డు స్థాయిలో
# 1.21 కోట్ల శ్రీవారి లడ్డూల విక్రయం

తిరుమల: ఈ ఏడాది మే నెలలో శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయాలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. మొత్తం 1.21 కోట్ల లడ్డూలను విక్రయించినట్లు టీటీడీ వెల్లడించింది. 2024 మే నెలలో 1.01 కోట్లు, 2025 మే నెలలో 1.10 కోట్ల లడ్డూలను విక్రయించగా.. ఈసారి సంఖ్య మరింత పెరిగింది. రోజుకు సగటున 4.08 లక్షల లడ్డూలను తయారు చేసింది. లడ్డూల తయారీకి టీటీడీ రోజువారీగా 68 టన్నుల ముడి పదార్థాలను వినియోగిస్తోంది. ఇటీవలి కాలంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత, రుచి మరింత మెరుగుపడటంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత, సంప్రదాయం, భక్తి భావనల సమ్మేళనంగా నిలిచే శ్రీవారి లడ్డూ ప్రసాదం తిరుమల మహత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటి చెబుతోంది.

## నేపాల్ ఆర్ఎస్‌పి ఛైర్మన్ లమిచానేతో ప్రధాని మోడీ భేటీ



న్యూఢిల్లీ : నేపాల్‌లో అధికారంలో ఉన్న రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ ఛైర్మన్ రబీ లామిచ్ఛనే బుధవారం ప్రధాని మోడీ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో విదేశాంగ శాఖామంత్రి ఎస్. జై శంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రిలు పాల్గొన్నారు. కాగా, ఈ సందర్భంగా ఉమ్మడి, సుసంపన్నమైన భవిష్యత్తు కోసం కలిసికట్టుగా పనిచేయాలన్న రబీ ఆకాంక్షను నేను స్వాగతిస్తున్నాను. మా పొదురుగు దేశాల భాగస్వామ్యానికి వస్తే.. నేపాల్ మాకు ప్రధాన భాగస్వామి. భారత్ -- నేపాల్ మధ్య ఉన్న ఈ విశిష్టమైన, బహుముఖ సంబంధాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు మేము నేపాల్‌లోని కొత్త ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నాము' అని మోడీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

## మమతాకు షాక్ : 58 ఎమ్మెల్యేలు తిరుగుబాటు



కోల్‌కతా : మమతాబెనర్జీకి భారీ షాక్ తగిలింది. టిఎంసి పార్టీలో చీలిక వచ్చింది. 58 మంది ఎమ్మెల్యేలు ఆ పార్టీపై తిరుగుబాటు చేశారు. టిఎంసి నిర్ణయాన్ని ఖాతరు చేయకుండా తిరుగుబాటు ఎమ్మెల్యేల తరపున అసెంబ్లీ ప్రతిపక్షనేతగా రితబ్రతా బెనర్జీని గుర్తించాలని అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ తిరుగుబాటు ఎమ్మెల్యేలందరికీ పార్టీ నుంచి సస్పెండ్ అయిన రితబ్రతా నాయకత్వం వహిస్తున్నారు. వీరందరినీ ఆయనే ప్రత్యేక బస్సులో అసెంబ్లీ వద్దకు తీసుకెళ్లి స్పీకర్‌కు లేఖ కూడా సమర్పించారు. ఎమ్మెల్యేల మద్దతు ప్రకారం రితబ్రతానే అసెంబ్లీ ప్రతిపక్షనేతగా స్పీకర్ ప్రకటిస్తే.. అసెంబ్లీలో టిఎంసికి ప్రతిపక్ష హోదా కూడా ఉండదు. కాగా, టిఎంసి శోభన్‌దేవ్ ఛట్టోపాధ్యాయను ప్రతిపక్షనేతగా ఎన్నుకోవడానికి మద్దతు ఇచ్చింది. అయితే టిఎంసి పార్టీలోని ఎమ్మెల్యేలు శోభన్‌దేవ్‌ని కాకుండా రితబ్రతను ప్రతిపక్షనేతగా మద్దతు ఇచ్చారు. దీంతో పశ్చిమబెంగాల్‌లో కొత్తగా ఈ పరిణామం ముందుకొచ్చింది.

## దేశపు బంగారాన్ని అమ్ముతున్నారా?

### - కేంద్రాన్ని ప్రశ్నించిన కేజ్రీవాల్



న్యూఢిల్లీ : డాలర్‌తో పోలిస్తే రూపాయి క్షీణిస్తోంది. ప్రస్తుతం డాలర్‌కు భారత కరెన్సీ విలువ 95 రూపాయలుగా ఉంది. ఈ నేపథ్యంలో దేశ విదేశీ మారక ద్రవ్య ఆస్తులను పరిరక్షించేందుకు భారతదేశపు బంగారు నిల్వల్లో కొంత భాగాన్ని విక్రయించిందన్న ఆరోపణలపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ బుధవారం కేంద్రాన్ని ప్రశ్నించారు. తాజాగా ఇరాన్ యుద్ధం వల్ల కలిగే పరిణామాల నుండి విదేశీ మారక ద్రవ్య ఆస్తులను కాపాడుకోవడానికి రిజర్వు బ్యాంకు తన బంగారు నిల్వల్లో కొంత భాగాన్ని విక్రయించి ఉండవచ్చని ఒక వార్తాకథనం వచ్చింది. ఈ కథనంపై కేజ్రీవాల్ స్పందించారు. మన దేశ ఆర్థిక పరిస్థితిపై కేంద్రం స్పష్టతనివ్వాలని ఆయన కోరారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. కాగా, 'ఈ వార్త నిజమేనా? దేశపు బంగారాన్ని అమ్ముతున్నారా? ప్రభుత్వం అంతగా దివాళా తీసిందా? గత 76 ఏళ్లలో, దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. కానీ దేశపు బంగారాన్ని ఎప్పుడూ అమ్మలేదు. ఇప్పుడు అమ్మింది అంటే పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని అర్థమా? ప్రభుత్వం మాకు ఎందుకు ఏమీ చెప్పడం లేదు? దేశ పరిస్థితి ఏమిటి?' అని కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏదన్నా సందర్భం వచ్చినప్పుడు మోడీజీ తన బ్యాగ్ సర్దుకుని వెళ్ళిపోతానని చెబుతుంటారు. కానీ మనం ఇక్కడే ఉండాలి, ఈ దేశంలోనే జీవించాలి అని కేజ్రీవాల్ సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. జూన్ 3వ తేదీన మోనిటరీ పాలసీ కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో వడ్డీరేట్లు, ద్రవ్యోల్బణం, విస్తృత ఆర్థిక పరిస్థితులపై చర్చ జరగనుంది. జూన్ 5వ తేదీన ఆర్‌బిఐ గవర్నర్ విధాన నిర్ణయాన్ని ప్రకటించనున్నారు.

## పెత్తనం చేస్తామంటే ఊరుకోం : పవన్ వ్యాఖ్యలపై కెటిఆర్



తెలంగాణ : 'నటుడిగా అభిమానిస్తాం.. సోదరుడిగా ఇంటికి వస్తే బిర్యానీ పెడతాం కానీ.. మా రాజకీయాల్లో పెత్తనం చేస్తామంటే ఊరుకోం- అని కెటిఆర్ హెచ్చరించారు. తెలంగాణపై ఎపి డిప్యూటి సిఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పందించారు. దేశభక్తి, పోరాటాల గురించి తాము పవన్ కల్యాణ్ దగ్గర నేర్చుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. తెలంగాణ ఓజీ కెసిఆర్ అని స్పష్టం చేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఉదయం నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కెటిఆర్ మాట్లాడుతూ మీడియావారు వేసిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. దేశంలో ఎవరైనా ఎక్కడైనా పార్టీ పెట్టుకోవచ్చని తెలిపారు. జనసేన కొత్తగా తెలంగాణలో పోటీ చేసేది ఏముందని అన్నారు. 2023 ఎన్నికల్లో బిజెపి తో కలిసి తెలంగాణలో పవన్ పోటీ చేశారని గుర్తుచేశారు. పవన్ కల్యాణ్‌ను ఎవరూ అడ్డుకోలేదని.. ప్రజలే అడ్డుకున్నారని ఆయన స్పష్టం చేశారు. ప్రాంతీయవాదం ఉగ్రవాదం కంటే ప్రమాదమని పవన్ కళ్యాణ్ అంటున్నారని... మరి మద్రాస్ నుంచి ఆంధ్ర వేరుపడాలని పొట్టి శ్రీరాములు 58 రోజుల పాటు ఆత్మబలిదానం చేసుకున్నారు కదా అది కూడా ప్రాంతీయ వాదం అంటారా ? అని ప్రశ్నించారు. ప్రాంతీయ వాదం అంటే తెలంగాణకి రావాల్సిన పెట్టుబడులు గుజరాత్‌లో పెట్టుకున్నారు.. మరి జాతీయవాదం ముసుగులో చేస్తున్న ఆర్థిక ప్రాంతీయ వాదం కరెక్టేనా ? అని నిలదీశారు. ప్రధాని మోడి కేవలం గుజరాత్‌కు పిఎంగా వ్యవహరించడం కరెక్టేనా అని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడితే 11 రోజులు అన్నం తినలేదని గతంలో పవన్ కల్యాణ్ అన్నారని కెటిఆర్ తెలిపారు. తెలంగాణ ఆవిర్భావం రోజు హైదరాబాద్‌కు వచ్చి సభ పెడతానంటే ఎలా ? అని ప్రశ్నించారు. దేశభక్తి గురించి పవన్ కల్యాణ్ తమకు నేర్పించాల్సిన అవసరం లేదని అన్నారు. తెలంగాణ భూమిపుత్రుల జాగీరే అని స్పష్టం చేశారు. 'నటుడిగా అభిమానిస్తాం.. సోదరుడిగా ఇంటికి వస్తే బిర్యానీ పెడతాం కానీ.. మా రాజకీయాల్లో పెత్తనం చేస్తామంటే ఊరుకోం- అని కెటిఆర్ హెచ్చరించారు. మొన్ననే అంత కష్టపడి విడిపోయాం కదా.. మళ్లీ మీ పెత్తనం ఎందుకు అని నిలదీశారు.

# లెక్కల్లో దాగుడుమూతలు




గణాంకాలపై ఎందరికెన్ని ఫిర్యాదులున్నా, ఎవరెంత వేళాకోళం చేసినా ప్రభుత్వ విధానాల రూపకల్పనకూ, అమల్లోవున్న విధానాల దిద్దుబాటుకూ అవే ఆధారం. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ మూడు రోజుల క్రితం విడుదల చేసిన జాతీయ కుటుంబ, ఆరోగ్య సర్వే(ఎన్ఎఫ్‌హెచ్ఎస్) చూస్తే మన దేశం ఏయే రంగాల్లో మెరుగుపడింది, ఇంకెన్ని రంగాల్లో సవరించుకోవాల్సిన అవసరముంది అనే విషయాలు తెలుస్తాయి. 1992--93లో విడుదల చేసిన తొలి సర్వేనుంచీ చూస్తే తాజాగా విడుదలైన సర్వే ఆరోది. దేశవ్యాప్తంగా 715 జిల్లాల్లో నిర్వహించిన ఈ సర్వే మాతా--శిశు ఆరోగ్యం, బాలల పౌష్టికాహారం, ఆరోగ్య బీమా వగైరాల్లో మన దేశం ముందడుగు వేసిందని చాటుతోంది. ఇది సమగ్రమైనదనీ, అత్యుత్తమ నాణ్యతతో కూడిన గణాంకాలు రాబట్టడానికి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్నామనీ ఆ నివేదిక వివరిస్తోంది. 2030 నాటికి ప్రపంచ దేశాలన్నీ సాధించి తీరాల్సిన వాటిగా ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు ఎంత చేరువలో ఉన్నాం... ఎంత దూరంలో ఉన్నాం అనేది తెలుసుకోవటం, తగువిధంగా సవరించుకోవటం ఈ గణాంకాల ఉద్దేశం. గత నివేదికతో పోలిస్తే ఆసుపత్రుల్లో శిశు జననాల శాతం పెరిగిందనీ(88.6 శాతం నుంచి 90.6 శాతానికి), ప్రసవానికి ముందు ఆరోగ్య పరిరక్షణ 95.9 శాతానికి చేరుకుందనీ, సంతాన సాఫల్యత రేటు స్థిరంగా 2.0 దగ్గరుందనీ, పౌష్టికాహారలోపం తగ్గిందనీ, ఏడాది--రెండేళ్లమధ్య వయసుండే పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల శాతం 87.1 శాతానికి చేరుకుందనీ నివేదిక వివరిస్తోంది. అసలు తొలి ఎన్ఎఫ్‌హెచ్ఎస్ నివేదికకూ, తాజా నివేదికకూ చూస్తే స్పష్టమైన పురోగతి కనిపిస్తుంది. అప్పట్లో కేవలం 40 శాతం ప్రసవాలు మాత్రమే ఆసుపత్రుల్లో జరిగేవి. అవి ఇప్పుడు 90 శాతానికి పెరగటం చిన్న విషయమేం కాదు. అయితే గణాంకాలు ఏం చెబుతున్నాయన్నది కాదు... ఏం చెప్పటం లేదన్నది ముఖ్యమని నిపుణులంటారు. ఆ కోణంలో ఎన్ఎఫ్‌హెచ్ఎస్ నివేదిక నిరాశపరుస్తుంది. గత నివేదికకూ, ఇప్పటికీ చూసినా ఎన్నో అంశాల దాటవేత తెలుస్తుంది. గత నివేదికకు మొత్తం 131 సూచీలుంటే ఇప్పుడవి 101కి తగ్గాయి. అంటే అనేక అంశాలను ఈ సర్వే పూర్తిగా విస్మరించిందన్నమాట! శిశువులు, పిల్లల మరణాల రేటైనా, కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలైనా, హెచ్ఐవిపై అవగాహన కల్పించటమైనా ఇందులో కనబడవు. అవి సర్వే చేయదగ్గ అంశాలు కాదనిపించటంలోని సహేతుకత ఏమిటో కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖకే తెలియాలి. ఒకవేళ వేరే గణాంకాల కోసం విడిగా సర్వే చేసివుంటే ఆ సంగతి చెప్పాలి. 2015--16 సంవత్సరంలో విడుదలైన నాలుగో నివేదికలో వంటగ్యాస్ వినియోగం 43.8 శాతం మేర ఉంటే ఆ తదుపరి సర్వే నాటికి అది 58.6 శాతానికి పెరిగిందని వెల్లడైంది. అటు తర్వాత కేంద్రం కోట్ల సంఖ్యలో అదనపు కనెక్షన్లు మంజూరు చేసింది. దాని ప్రభావం ఎలా ఉందో చూద్దామంటే ఇప్పుడది మాయం! స్వచ్ఛ భారత్ అభియాన్ కింద మరుగుదొడ్ల నిర్మాణాల సంఖ్య 10 కోట్లకు చేరుకుందని 2019లో ప్రకటించి, దాన్ని కీలకమైన ఘట్టంగా చెప్పారు. తీరా తాజా నివేదిక ప్రస్తుత స్థితి ఎలా వుందో, అటుతర్వాత మెరుగుపడిందో లేదో చెప్పకుంటే ఎలా? ఇక పిల్లల్లో, మహిళల్లో రక్తహీనత ఎలా వుందన్న ప్రశ్న కూడా ఎగిరిపోయింది. గత సర్వేలో ఈ అంశానికి సంబంధించి ఏడు సూచీలున్నాయి. అయితే ఈ నివేదికలో నేరుగా నగదు బదిలీ, డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక లావాదేవీలు వగైరా అంశాలున్నాయి. మంచిదే. అంత మాత్రాన ఇతర సూచీలు తొలగించటం సరికాదు. మనం చెప్పుకోవటానికైతే జీడీపీపరంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో ఆరో స్థానంలో ఉన్నాం. కానీ మౌలికంగా మనది అల్పాదాయ వర్గాలు అధికంగా ఉండే దేశం. సంపద పంపిణీ రీత్యాచూస్తే జనాభాలో కేవలం 10 శాతంమంది దగ్గర దాదాపు 65 శాతం సంపద ఉండగా, వీరిలో కేవలం 1 శాతంమంది చేతుల్లో 40 శాతం సంపద ఉంది. అట్టడుగు 50 శాతం జనాభా చేతిలో కేవలం 6.4 శాతంమేర మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో పాలనాపరమైన జోక్యాలతోనే నిరుపేద వర్గాలకు వివిధ అంశాల్లో సాయం అందించటం సాధ్యమవుతుంది. ఐక్యరాజ్యసమితి లక్ష్యాలు అందుకోవాలంటే మన వర్తమాన స్థితిగతుల అధ్యయనం తప్పనిసరి. దాన్ని విస్మరించటం తెలివైన పనికాదు.

# సర్‌పై గుబులు



మన రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్-సర్) ఈ నెల 5 నుంచి ప్రారంభమై సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితా ప్రచురణతో పూర్తవుతుందని కేంద్ర ఎన్నికల సంఘం (ఇసి) షెడ్యూలు ప్రకటించగా ఇక్కడి అధికార యంత్రాంగం అందుకు సమాయత్తమవుతోంది. వివాదాస్పద 'సర్'ను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నది ఇసినే అయినా వెనకుండి నడిపిస్తున్నది కేంద్రంలోని మోడీ ప్రభుత్వమన్నది బహిరంగ రహస్యం. కాగా రాష్ట్రంలోని అధికార కూటమికి నేతృత్వం వహిస్తున్న తెలుగుదేశం పార్టీ, ప్రధాన ప్రతిపక్షం వైసిపి అధినేతలు చంద్రబాబు, జగన్.. ఇద్దరూ 'సర్' ఎక్కడ తమ కొంప ముంచుతుందోనని ఒక వైపు భయపడుతూనే 'సర్'ను తీసుకొచ్చిన ఇ.సి.ని, సదరు రాజ్యాంగబద్ధ సంస్థను ప్రభావితం చేస్తున్న బిజెపిని, ప్రధాని మోడీని, ఆయన ప్రభుత్వాన్ని పల్లెత్తి మాట్లాడకపోవడం ఆ రెండు పార్టీల రాజకీయ అవకాశవాదాన్ని తెలుపుతుంది. అధికార కూటమిలోని భాగస్వామ్యపార్టీ జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ వివాదాస్పద 'సర్'ను ప్రశ్నించలేదు. కాని ఆ పక్రియపై అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలను కోరారు. టిడిపి నిర్వహించిన 'మహానాడు'లో 'సర్'పై జాగ్రత్తగా ఉండాలని పార్టీ శ్రేణులను చంద్రబాబు హెచ్చరించారు. మంగళవారం తమ పార్టీ ఎంఎల్‌ఎలతో 'సర్'పైనే ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. సరిగ్గా టిడిపి 'మహానాడు' రోజునే జగన్ తమ పార్టీ నేతలతో నడిపిన సమావేశంలో ప్రధానంగా 'సర్'పైనే ఎక్కుపెట్టారు. తమిళనాడు, పశ్చిమబెంగాల్ ఎన్నికలు అక్కడి ప్రభుత్వాల ఓటమి, వ్యక్తిగతంగా ఆ రాష్ట్రాల ముఖ్యమంత్రుల పరాజయాలను గణాంకాలతో విశదీకరించారు. జగన్ ఇంకో అడుగు ముందుకేసి కేవలం ఉద్దేశపూర్వక ఓట్ల తొలగింపులే కాదు చేర్పింపులు కూడా డేంజరేనంటున్నారు. చంద్రబాబు, జగన్.. ఇద్దరూ 'సర్'పై గుబులుగా ఉన్నారని వారి వ్యాఖ్యలతో అర్థమవుతుంది. ఇ.సి. 'సర్'ను చివరిగా వాజపేయి ప్రధానిగా ఉన్న సమయంలో 2002లో చేపట్టింది. అయితే అప్పటికి ఇప్పటికీ 'సర్'కు ఇ.సి. ప్రవేశపెట్టిన నిబంధనలు, ఓటు హక్కు కోసం పౌరులను చూపించమంటున్న కొన్ని పత్రాలే సమస్య. పౌరులు తాము ఓటర్లుగా జాబితాలో కొనసాగాలన్నా, కొత్తగా చేరాలన్నా పౌరసత్వం నిరూపించుకోవాలన్న షరతు రాజ్యాంగ విరుద్ధమైనది. ఇది సార్వత్రిక ఓటు హక్కును దెబ్బతీస్తుంది. 'సర్'ను చేపట్టిన పలు రాష్ట్రాలలో చిన్న కారణాలతో ఓటు తొలగించబడిన, అనుమానాస్పద జాబితాలో చేర్చి ఓటు నిరాకరించబడిన వారు లక్షలాదిగా ఉన్నారు. వీరందరూ వారి ఓటు హక్కును కోల్పోయారు. పశ్చిమబెంగాల్‌లో 91 లక్షల ఓట్లు తొలగించారు. న్యాయస్థానం ద్వారా 27 లక్షల ఓట్లకు పరిష్కారం లభించినా వారు ఓటు వేయలేకపోయారు. తొలగించిన 91 లక్షల ఓట్లనూ ప్రత్యేకంగా పరిశీలించాలంటే కనీసం నాలుగైదేళ్లయినా పడుతుందని ప్రత్యేక ట్రిబ్యునల్ జడ్జి వెల్లడించారంటే పరిస్థితి ఎంత లోపభూయిష్టమో తెలుస్తుంది. 'సర్' ప్రక్రియలో ఓట్లు కోల్పోయిన వారికి బీహార్, బెంగాల్‌లలో రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాలు కూడా నిలిపివేయడం దారుణం. ఈ ప్రమాదాన్ని గుర్తెరగాలి. ఓట్లు కోల్పోయిన వారిలో అత్యధికంగా బలహీనులు, వలసదారులు, పేదలు, దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, సమాజంలో ఇతర వెనకబడిన తరగతులే ఎక్కువ. మోడీ ప్రభుత్వం 'సర్' ద్వారా దేశ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించిన జాతీయ పౌర పట్టిక (ఎన్‌సిఆర్)ను పరోక్షంగా ప్రవేశపెట్టేందుకు కుట్రలు పన్నింది. ఆ కొనసాగింపుగా పార్లమెంట్‌లో సి.ఎ.ఎ. బిల్లుకు టిడిపి, వైసిపి పోటీపడి మద్దతిచ్చాయి.ద

ఒక్క సి.ఎ.ఎ. బిల్లే కాదు కేంద్రం తీసుకొచ్చే ప్రతి బిల్లుకూ టిడిపి, వైసిపి, జనసేన ఓటేసి గెలిపించి బిజెపిని, మోడీని మెప్పిస్తున్నాయి. 'సర్' నిజస్వరూపాన్ని వామపక్షాలు మాత్రమే బయటపెట్టి ఎండగట్టాయి. ఇ.సి. వద్ద జరిగిన సమావేశంలో నిజాయితీగా, పారదర్శకంగా 'సర్' నిర్వహించాలని, అర్హులైన ఏ ఒక్కరి ఓటు పోకూడదని డిమాండ్ చేశాయి. 'సర్'తో జాగ్రత్తని తమ శ్రేణులను అప్రమత్తం చేస్తున్న టిడిపి, వైసిపి తమ రాజకీయ లాభనష్టాలను బేరీజు వేసుకుంటున్నాయి తప్ప ఆ ప్రక్రియను తమ విద్వేష రాజకీయాలకు వాడుకుంటున్న బిజెపి, మోడీ పట్ల ప్రభు భక్తి ప్రదర్శించడం వంచనే కాగలదు. పాలకవర్గ పార్టీల విన్యాసాలెలా ఉన్నా ప్రజలు అప్రమత్తం కావాలి.

# సంపన్నులకు రాయితీలు!




సామాన్యులకు డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరల్ని పెంచుతున్న కేంద్ర బిజెపి ప్రభుత్వం విమాన ఇంధన ధరను అమాంతం తగ్గించడాన్ని బట్టి దాని స్వభావం తేటతెల్లమవుతోంది. సామాన్యుల పట్ల కక్షపూరితంగానూ, సంపన్నులకు వరాల మూట కట్టబెట్టడం దాని నైజమని ఇట్టే బోధపడుతుంది. మే 15 నుంచి 10 రోజుల వ్యవధిలోనే సాధారణ ప్రజానీకం వినియోగించే పెట్రోలు, డీజిల్‌పై నాలుగుసార్లు భారాలు వేసిన మోడీ ప్రభుత్వం, తాజాగా వాణిజ్య సిలిండర్‌పై మరో 42 రూపాయలు వడ్డించింది. పర్యావరణాన్ని పరిరక్షించే ఉద్దేశంతో సిఎన్ జి వాహనాలను నడిపే ఆటో, క్యాబ్ యజమానులు, వినియోగదారులపైనా ఇటీవల కిలోపై 2 రూపాయలు వడ్డించింది. మరోవైపు విమాన ఇంధనం (ఎటిఎఫ్) ధరలను గతంలో ఎన్నడూ లేనివిధంగా 27 శాతం తగ్గించింది. విజయవాడలో ప్రస్తుతం పెట్రోల్ ధర రూ.117.78, డీజిల్ ధర రూ.105.45గా ఉన్నాయి. ప్రస్తుతం దేశీయ విమానాలకు సరఫరా చేస్తున్న ఎటిఎఫ్ (కిలో లీటరు రూ.1,04,927) లీటరు రూ.104.92గా ఉంది. ఇందులో అంతర్జాతీయ విమానాల కోసం 27 శాతానికి తాజాగా కోత పెట్టింది. పశ్చిమాసియా సంక్షోభంతో ముడిచమురు ధర పెరగడం వల్ల విమానయాన సంస్థలు ఇంధన భారాలు మోయలేక ఇబ్బంది పడిపోతుండటం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర పెద్దల ఉవాచ. అంటే మన రైతులు ట్రాక్టర్లలో వినియోగించే, నిత్యావసర సరుకుల రవాణాకు లారీల్లో వినియోగించే డీజిల్ కంటే దాదాపు 28 రూపాయలు తక్కువ ధరకు విమానయాన సంస్థలు ఎటిఎఫ్‌ను పొందగలుగుతున్నాయన్న మాట! ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుని పొలాల్లో శ్రమిస్తూ... అన్నం పెడుతున్న రైతన్నపై ఏ మాత్రం కనికరం లేకుండా గత నెలలో భారాలు మోపేసిన కేంద్రం సంపన్నుల ఆకాశ యానానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం వారి వర్గ ప్రాధాన్యతకు అద్దం పట్టేదే. ఇప్పటికే సంక్షోభంలో కూరుకుపోతున్న చిన్న, సన్నకారు, కౌలు రైతులు ఎకరాకు మూడు వేల రూపాయల కంటే అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడటం గోరుచుట్టుపై రోకలి పోటే. డీజిల్ ధర పెంపుతో ఆటోలు, ట్యాక్సీలు, లారీలు నడుపుకుని బతికేవారు, వాటిలో పనిచేసేవారూ, గిగ్‌వర్కర్లు మరిన్ని కష్టాల పాలవడం కేంద్రం వైఫల్యమే. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగినప్పుడల్లా ప్రజలపై భారాలు వేయడం, తగ్గినప్పుడు ఎక్సైజ్ డ్యూటీలు, సర్ ఛార్జీలు పెంచేసి ఆ మిగులును తన ఖాతాలో వేసుకోవడం మోడీ సర్కారుకు పరిపాటిగా మారింది. వంట గ్యాస్ ధరలను సైతం అడ్డూఅదుపూ లేకుండా పెంచేయడం, కమర్షియల్ గ్యాస్ ధరను అమాంతం రూ.995 పెంచేశాక, ఇప్పుడు మరో 42 రూపాయలు పెంచడం సామాన్యులతోపాటు హోటల్ రంగాన్ని ప్రమాదంలోకి నెట్టేసింది. బయట కొనుక్కోలేక అర్ధాకలితో అలమటించే అసంఘటిత కార్మికులు, చిరుద్యోగులు, నిరుద్యోగుల సంఖ్యను పెంచే విధానాన్ని అనుసరించడమే మోడీ పొదుపు సూత్రాల లోగుట్టు. పెట్రో ధరలు పెరిగితే మిగతా వస్తువులన్నింటి ధరలూ పెరుగుతాయి. ప్రజల కొనుగోలు శక్తి ఆ మేరకు పెరగనందున వినియోగం తగ్గిపోతుంది. గొలుసుకట్టు ప్రభావం ఫలితంగా ఆర్థిక వ్యవస్థ మందగమనంలోకి వెళ్తుంది. ప్రస్తుత ఆర్థిక సంక్షోభం ఇంకా తీవ్రతరమవుతుంది. నిరుద్యోగం, పేదరికానికి కారణమవుతున్న ఈ విధానాలను విడనాడి, సామాన్యుడి పక్షాన ఆలోచించగలగడమే ఈ పరిణామాలకు విరుగుడు. ఆ దిశగా అడుగులు వేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి చేయడం ప్రధానం. అందుకు ఐక్య ప్రజాపోరాటాలే మార్గం.

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com epaper: https://epaper.mahinewsindia.com

# విద్యా స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి మూలస్తంభం

## విశ్వవిద్యాలయాలు కేవలం డిగ్రీలకు కాదు, స్వేచ్ఛగా ఆలోచించడానికి, ప్రశ్నించడానికే.




అనంతపురం మహి న్యూస్ జూన్ 3: భారత్‌లో రాజకీయ జోక్యం, భావజాల నియంత్రణ, సెన్సార్‌షిప్ వల్ల విద్యా స్వేచ్ఛ ప్రమాదంలో పడింది. వి-డెమ్ అకడమిక్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో 179 దేశాల్లో భారత్ 156వ స్థానం - "పూర్తిగా పరిమితం" అని వర్గీకరణ. జె యన్ యు, లో సెమినార్లు రద్దు, చర్చలపై నిషేధం, దళిత ప్రొఫెసర్‌పై దాడి - స్వతంత్ర ఆలోచనపై అసహనం పెరిగింది. యూజీసీ ద్వారా ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలు బలవంతం, వైస్ ఛాన్సలర్ల నియామకాల్లో రాజకీయ ప్రభావం - స్వయంప్రతిపత్తి క్షీణత. ప్రభుత్వాన్ని విమర్శించే అధ్యాపకులపై చర్యలు, చట్టపరమైన వేధింపులు - భయంతో స్వీయ సెన్సార్‌షిప్ పెరుగుతోంది. విశ్వవిద్యాలయాలు రాజకీయ ప్రచార వేదికలుగా మారితే, వాస్తవం-ప్రచారం వేరు చేసే శక్తి సమాజం కోల్పోతుంది. విమర్శనాత్మక ప్రశ్నలు లేకుంటే జ్ఞాన సృష్టి ఆగిపోతుంది, ప్రజా విధానాలు, ఆవిష్కరణలు దెబ్బతింటాయి. ఠాగూర్ కలగన్న "భయం లేని మనస్సు" కోసం విద్యా స్వేచ్ఛకు చట్టపరమైన రక్షణలు అత్యవసరం. విద్యా స్వేచ్ఛను కాపాడటం అంటే మేధావులను కాదు, భారత ప్రజాస్వామ్య భవిష్యత్తును కాపాడటమే.

# నెట్ జీరో హెల్త్ క్యాంపస్... అనంత అరణ్య... కలెక్టర్ రాజకుమారి





నంద్యాల మహి న్యూస్ జూన్ 3: రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీలు, హాస్టళ్లను 2 ఏళ్లలో "నెట్ జీరో అండ్ హెల్తీ క్యాంపస్‌లు"గా మార్చాలని నంద్యాల కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశం. పర్యావరణ పరిరక్షణ, కార్బన్ ఉద్గారాల తగ్గింపు, విద్యార్థుల్లో ప్రకృతి బాధ్యత పెంచడమే లక్ష్యమని తెలిపారు.



అల్ట్రా హై డెన్సిటీ ప్లాంటేషన్ - అనంత అరణ్య మోడల్‌ను యం జీ యన్ అర్ ఈ ఎస్, వీబీ-గ్రామ్ నిధులతో అమలు చేస్తారు. మొక్కలు నాటడం భవిష్యత్ తరాలకు ఆరోగ్యకర వాతావరణం అందించే సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. పచ్చదనం వల్ల గాలి నాణ్యత, ప్రజారోగ్యం, ఉత్పాదకత, ఆర్థికాభివృద్ధి పెరుగుతుందని చెప్పారు. ప్రతి విద్యాసంస్థలో "వేస్ట్ టు వెల్త్", సర్క్యులర్ ఎకానమీ విధానాలు అమలు చేయాలని సూచించారు. మట్టి సారవంతానికి బయోచార్ వాడకం, కార్బన్ క్రెడిట్ ట్రేడింగ్ అవకాశాలను రైతులు అందిపుచ్చుకోవాలన్నారు. డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, ఖర్జూరం, మెకాడమియా నట్స్ వంటి అధిక విలువ పంటలతో రైతులకు మంచి లాభాలు వస్తున్నాయని తెలిపారు. జిల్లా జీడీపీ పెరుగుదలలో హార్టికల్చర్, పశుసంవర్ధక రంగాలు కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ప్రిన్సిపాళ్లు, కేజీబీవీ అధికారులు, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

# ప్రతి ఓటరు మ్యాపింగ్ పక్కా గా జరగాలి

## బి ఎల్ ఓ లు గ్రామస్థుల సహకారంతో మ్యాపింగ్ చేయండి



వై ఎస్ ఆర్ కడపమహి న్యూస్ ,జూన్ 03: ప్రతి ఓటరు మ్యాపింగ్ పక్కా గా జరగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.. మంగళ వారం రాత్రి జిల్లా సచివాలయం లోని బోర్డు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ ఆర్ ఓ,ఏ ఈ ఆర్ ఓ లతో ఇంటింటా జనగణన,ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియల పై జిల్లా కలెక్టర్ సమీక్షించారు.. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ...జిల్లాలో ఇంటింటా జనగణన,ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని తెలిపారు.. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత,ఖచ్చితత్వం అత్యంత ముఖ్యమని తెలిపారు.ఈఆర్‌ఓలు,ఏఈఆర్‌ఓలు, బిఎల్‌ఓ లకు సమగ్రం గా శిక్షణ ఇచ్చి,క్షేత్రస్థాయిలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలని సూచించారు.కార్పొరేషన్ మరియు మున్సిపాలిటీ పరిధిలో ఓటర్ మ్యాపింగ్ లో రెవెన్యూ శాఖ తో సమన్వయం తో పని చేయాలన్నారు.బి ఎల్ ఓ లకు శిక్షణ ను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు.గత మే నెల 01 నుంచి 31 వరకు జరిగిన ఇంటింటా జనగణన నమోదు ప్రక్రియను ప్రభుత్వం జూన్ 06వరకు పొడిగించిందన్నారు.ఈ ఇంటింటా జనగణనపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి జూన్ 06 లోపు వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ ప్రక్రియ నిమిత్తం క్షేత్రస్థాయి అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలనన్నారు. ఈ సమావేశం లో డి ఆర్ ఓ మల్లికార్జునుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రైతుపై ధాన్యం వ్యాపారి దౌర్జన్యం

## తనపై చేతులు వేసి అసభ్యకరంగా ప్రవర్తించాడని మహిళా రైతు కన్నీటి పర్యంతం



కాట్రేనికోన మండలం, మహి న్యూస్, జూన్ 3: కాట్రేనికోన మండలంలో ఓ మహిళా రైతు పట్ల ధాన్యం వ్యాపారి కుటుంబ సభ్యులు వ్యవహరించిన తీరు తీవ్ర కలకలం రేపింది. తనకు రావలసిన ధాన్యం డబ్బులు అడిగినందుకు అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ బాధిత మహిళ జిల్లా అదనపు ఎస్పీ ప్రసాద్‌ను ఆశ్రయించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ రావు ఆమెకు అండగా నిలిచి పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం బంటుమిల్లి గ్రామానికి చెందిన కొప్పిశెట్టి దుర్గభవాని తన తండ్రితో కలిసి 12 ఎకరాల్లో వరి సాగు చేస్తోంది. ఇటీవల పండించిన సుమారు 600 బస్తాల ధాన్యాన్ని స్థానిక వ్యాపారి చల్లపల్లి శ్రీనివాసరావుకు విక్రయించినట్లు ఆమె తెలిపింది. ఈ ధాన్యానికి సంబంధించి దాదాపు రూ.10 లక్షల వరకు చెల్లింపులు రావాల్సి ఉండగా, కేవలం రూ.4.57 లక్షలు మాత్రమే తన తండ్రి ఖాతాలో జమ చేసినట్లు చూపించారని పేర్కొంది. అయితే ఆ మొత్తం కూడా తమకు అందకుండా వ్యాపారి శ్రీనివాసరావు బలవంతంగా తిరిగి తన ఖాతాకు బదిలీ చేయించుకున్నారని బాధితురాలు ఆరోపించింది. ధాన్యం విక్రయించినప్పటికీ పూర్తి డబ్బులు ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తున్నారని ఆమె వాపోయింది. తమకు రావలసిన డబ్బుల గురించి ప్రశ్నించేందుకు వ్యాపారి ఇంటికి వెళ్లిన సమయంలో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారిందని దుర్గభవాని తెలిపింది. వ్యాపారి కుమారులు సింహాచలం, మణికంఠ తనపై చేతులు వేసి అసభ్యకరంగా ప్రవర్తించారని, మహిళగా తన గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ప్రవర్తించారని కన్నీటి పర్యంతమైంది. డబ్బులు అడిగినందుకే తమను అవమానించారని, బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించింది. అంతేకాకుండా తమ వద్ద నుంచి ఖాళీ ప్రామిసరీ నోట్లు, చెక్కులు తీసుకుని, ఇప్పుడు తామే వారికి బాకీ ఉన్నట్లు చిత్రీకరిస్తూ ఒత్తిడి తెస్తున్నారని ఆమె పేర్కొంది. ఈ వ్యవహారంతో తమ కుటుంబం తీవ్ర మానసిక ఆందోళనకు గురైందని, ప్రాణభయం కూడా నెలకొందని ఆవేదన వ్యక్తం చేసింది. జిల్లా పోలీసు అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని తనకు రావలసిన రూ.10 లక్షల బకాయిని ఇప్పించడంతో పాటు తమ వద్ద ఉన్న ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్లు తిరిగి స్వాధీనం చేయాలని బాధితురాలు విజ్ఞప్తి చేసింది. అలాగే వ్యాపారి కుటుంబ సభ్యుల నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ రావు మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం దళారుల వ్యవస్థ రైతులను దోపిడీ చేస్తున్నదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అన్నం పెట్టే రైతుకే సున్నం పెట్టే పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లలో తూకాల నుంచి చెల్లింపుల వరకు రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రైతుల శ్రమను దోచుకునే ధాన్యం వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు ఎక్కడైనా అన్యాయం జరిగితే తమను సంప్రదించాలని, బాధిత రైతులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. మహిళా రైతుపై జరిగిన దౌర్జన్యంపై సమగ్ర విచారణ జరిపి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. ఈ ఘటన జిల్లాలో ధాన్యం వ్యాపారుల వ్యవహార శైలిపై మరోసారి చర్చకు దారి తీసింది. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన అనంతరం చెల్లింపులు ఆలస్యం చేయడం, బకాయిల విషయంలో ఒత్తిళ్లు తీసుకురావడం, మహిళా రైతులను సైతం వేధింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. బాధితురాలి ఫిర్యాదుపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.


# మన ప్రవర్తనను తీర్చిదిద్దడంలో మనకు సహాయం చేసిన ప్రతి ఒక్కరికీ మనము కృతజ్ఞులము...లాలాజీ మహారాజ్




కడప మహి న్యూస్ జూన్ 3: ప్రవర్తన ఒకానొకప్పుడు వైవిధ్యమైన శాస్త్రాలలో ఉన్న అపారమైన జ్ఞానం వల్ల దేశంలోని వారందరి చేత గౌరవించబడే ఒక రాజ పురోహితుడు ఉండేవాడు. అంతటి జ్ఞానవంతుడైనా, ఆయనకి కొంచెం కూడా అహం లేదు. ప్రాపంచిక, ఆధ్యాత్మిక పురోగతికి జ్ఞానం, ప్రవర్తనల కలయిక మాత్రమే నిజమైన మార్గం అని ఆయన విశ్వసించాడు. ప్రజలకే కాదు, మహారాజుకు కూడా ఆయనంటే ఎంతో గౌరవం. పురోహితుడు రాజాస్థానానికి వచ్చినప్పుడు రాజు ఎల్లప్పుడూ తన సింహాసనం నుండి లేచి, పురోహితుడు కూర్చున్న తర్వాత మాత్రమే కూర్చునేవాడు. ఒకసారి పురోహితునికి తనకు ఈ గౌరవం ఎందుకు లభిస్తుందో తెలుసుకోవాలనే కుతూహలం కలిగింది - ఈ గౌరవం తన జ్ఞానం కోసమా లేక తన బలమైన నైతిక స్వభావానికి ఆదరణా ? అది కనిపెట్టడానికీ, తన ఉత్సుకతను సంతృప్తిపరచడానికీ ఒక పథకం వేసుకున్నాడు. తన ప్రణాళికను కార్యరూపంలోకి తీసుకురావడానికి, పురోహితుడు రాజు యొక్క ఖజానాకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా నిధిలోంచి ఐదు అమూల్యమైన ముత్యాలు తీసి జేబులో పెట్టుకున్నాడు. అది చూసిన కోశాధికారి ఆశ్చర్యపోయాడు. గౌరవనీయులైన రాజ పురోహితుడు దొంగతనం చేయగలడని లేదా



ధనం అంటే దురాశ కలవాడని అతను నమ్మలేకపోయాడు. ఈ ఆలోచనతో రోజంతా కలవరపడ్డాడు. మరుసటి రోజు, రాజదర్బార్ నుండి తిరిగి వస్తుండగా, పూజారి మళ్లీ ఖజానాను సందర్శించి, ఐదు ముత్యాలను తీసుకొని తన వద్ద ఉంచుకున్నాడు. ఇప్పుడు, కోశాధికారికి పూజారి పట్ల ఉన్న గౌరవం క్షీణించడం ప్రారంభమైంది. మూడో రోజు కూడా అదే సంఘటన జరగడంతో కోశాధికారి ఓపిక నశించి ఇక ఆగలేకపోయాడు. రాజ పురోహితుడు దుష్ట ఆంతర్యాలు కలిగిఉన్నాడన్న అతని అనుమానం ధృవీకరించబడింది. జరిగిన సంఘటన అంతా రాజుకు వివరంగా చెప్పాడు. ఈ సమాచారం విన్న రాజు చాలా ఆశ్చర్యపోయాడు. పురోహితుని పట్ల రాజుకు గల గౌరవం, విశ్వాసం పూర్తిగా ధ్వంసం అయిపోయింది. పురోహితుడు నాల్గవ రోజు రాజాస్థానానికి వచ్చినప్పుడు, రాజు అతనిని పలకరించడానికి సింహాసనం నుండి లేవలేదు సరికదా అతని వైపు చూడలేదు. పూజారి తన ప్రణాళిక పనిచేస్తున్నది అన్నదానికి దీనిని ఒక చిహ్నంగా తీసుకున్నాడు. అతను ముత్యాలు తీసుకున్న ప్రయోజనం త్వరలో నెరవేరబోతోందన్న ఆలోచనతో, నిశ్శబ్దంగా తన స్థానంలో కూర్చున్నాడు. రాజకీయ కార్యకలాపాలు పూర్తి అయిన తర్వాత, పురోహితుడు మిగతా సభ్యులలాగా బయలుదేరడానికి లేచినప్పుడు, రాజు ఆయన్ని కొంత సేపు వేచిఉండమని ఆదేశించాడు. మిగిలిన సభాసదులందరూ వెళ్ళిపోయిన తర్వాత, రాజు ఆయనని అడిగాడు, "మీరు రాజ ఖజానా నుండి ఏదో తీసుకున్నారని నేను విన్నాను, అది నిజమేనా?". ఈ ప్రశ్నకు పురోహితుడు మౌనంగా ఉండడంతో రాజుకు కోపం వచ్చింది. ఈసారి స్వరం పెంచి, "రాజ ఖజానా నుండి ముత్యాలు తీశారా ?" అని అడిగాడు. పురోహితుడు మౌనంగా అవునన్నట్లుగా తల వూపాడు. రాజు తర్వాతి ప్రశ్న: "ఎన్ని ముత్యాలు తీసుకున్నారు, ఎన్నిసార్లు తీసుకున్నారు?" అని కాసేపు ఆగి, తర్వాత ఇలా అడిగాడు, "ఆ ముత్యాలు ఎక్కడ ఉన్నాయి?" పురోహితుడు తన జేబులోంచి చిన్నగా మడతపెట్టిన సంచి తీసి రాజు ముందు పెట్టాడు. అందులో మొత్తం పదిహేను ముత్యాలున్నాయి. దుశ్చర్యకు సంబంధించిన రుజువు చూసిన రాజుకు ఒక్కసారిగా కోపం, విచారం, ఆశ్చర్యం కలిగాయి. రాజు ఇలా అన్నాడు, " స్వామి ఇలా ఎందుకు చేసారు?



కనీసం మీ పదవితో ముడిపడిన గౌరవం గురించి అయినా మీరు పట్టించుకోలేదా? ఇలా చేయడానికి మీకు సిగ్గనిపించలేదా ? అలా చేయడం వల్ల మీరు మీ జీవితకాలపు పరువును పోగొట్టుకున్నారు." " ఏదో ఒకటి చెప్పండి, ఎందుకు ఇలా చేశారు?" బాధలో ఉన్న రాజుని చూసి, పురోహితుడు ప్రతిదీ వివరంగా చెప్పి , తృప్తిగా అన్నాడు, "మహారాజా, జ్ఞానం, ప్రవర్తన - ఈ రెంటిలో ఏది గొప్పదో తెలుసుకోవడానికే ఖజానా నుండి ముత్యాలను తీసుకున్నాను. నైతికమైన, ఋజుప్రవర్తన యొక్క ప్రాముఖ్యతపై నా దృక్పథం ఇప్పుడు చాలా స్పష్టమైంది". మీ నుండి, మీ ప్రజల నుండి ఇప్పటివరకు నాకు లభించిన ప్రేమ, గౌరవం నా జ్ఞానం వల్ల కాదు, నా ప్రవర్తన వల్ల. మీ ఖజానాలో అత్యంత విలువైనది 'ప్రవర్తన'. కాబట్టి, మీ రాజ్యంలోని ఉన్నత నైతికత కలిగిన వ్యక్తులను మీరు ప్రోత్సహించాలని, అభినందించాలని నేను కోరుకుంటున్నాను. ఈ విధంగా, ప్రజల దృష్టిలో ఉన్నత ప్రవర్తన యొక్క విలువ క్రమంగా పెరిగి , బలమైన దేశానికి పునాది వేయబడుతుంది. శతాబ్దాలుగా ఒక బలమైన నైతిక ప్రవర్తన, జ్ఞానం యొక్క అహంకారంపై విజయం సాధించిందనడానికి చరిత్రయే రుజువు ." మంచి హృదయం, దయగల భావాలు, సమతుల్య మనస్సు - ప్రవర్తనకు పునాదిగా ఉంటాయి.

# పరిగిలో ఘనంగా కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఏ ల శిక్షణ శిబిరం: పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి

**ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్ ఐ ఆర్ కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు పరిగి పట్టణంలోని ఎన్ కె కన్వెన్షన్ హాల్ లో కాంగ్రెస్ పార్టీ (బూత్ లెవెల్ ఏజెంట్)ల శిక్షణ శిబిరం పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించబడింది.**



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల్లో అనేక నియోజకవర్గాల్లో అత్యంత స్వల్ప ఓట్ల తేడాతో గెలుపు ఓటమి నమోదు అయ్యాయని పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి అన్నారు. పరిగి లోని ఎన్కే కన్వెన్షన్ హాల్ లో బుధవారం బిఎల్ఏ ల సమావేశం జరిగింది ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) నియమించిన ప్రత్యేక ట్రైనర్లు ఎం. రాఘవేందర్ రెడ్డి, నరేష్ రాథోడ్, డా. పి. రాజశేఖర్ రెడ్డి, పి. రాజేష్ మరియు మోహన్ ఎస్ ఐ ఆర్ విధివిధానాలు, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, ల బాధ్యతలు, చేపట్టాల్సిన కార్యాచరణపై సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా టి పి సి సి ట్రైనింగ్ కమిటీ చైర్మెన్, ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, బీహార్ పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ప్రక్రియ పేరుతో లక్షలాది మంది ఓటర్ల పేర్లు ఓటరు జాబితాల నుంచి తొలగించే ప్రయత్నాలు జరిగాయని, ఇదే విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలనే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు ప్రాణాధారమని, ఓటర్ల హక్కులను హరించే ఎలాంటి చర్యలను కాంగ్రెస్ పార్టీ సహించబోదని అన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు శ్రీ రాహుల్ గాంధీ , కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ మల్లికార్జున ఖర్గే గమ మరియు కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం ఎస్ ఐ ఆర్ విధానానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పోరాటం చేస్తోందని తెలిపారు. ప్రక్రియ పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, టి పి సి సి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం ఖూజజ ఆధ్వర్యంలో ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ప్రక్రియలో ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే స్పందించి పరిష్కరించేలా కాంగ్రెస్ పార్టీ చర్యలు చేపడుతోందని తెలిపారు. అలాగే, బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్ ఐ ఆర్ ప్రక్రియ కారణంగా కొన్ని ప్రాంతాల్లో అన్యాయంగా ఓటర్ల పేర్ల నిర్మూలన జరుగుతోందని మండిపడ్డారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధమైన ఇటువంటి చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని స్పష్టం చేశారు. శిక్షణ శిబిరంలో పాల్గొన్న ప్రత్యేక ట్రైనర్లు కొత్త ఓటర్ల నమోదు విధానం, 18 సంవత్సరాలు పూర్తయిన యువతను ఓటర్లుగా నమోదు చేసే ప్రక్రియ, ఓటరు జాబితాలో పేరు మార్పులు, చిరునామా మార్పులు, తొలగింపులు మరియు సవరణల కోసం అనుసరించాల్సిన విధివిధానాలను లకు వివరించారు. అలాగే కొత్త ఓటర్ల నమోదుకు అవసరమైన పత్రాలు, ఆన్‌లైన్ , ఆఫ్‌లైన్ దరఖాస్తు విధానాలపై కూడా అవగాహన కల్పించారు. అదేవిధంగా, ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించబడకుండా అప్రమత్తంగా ఉండటంతో పాటు, కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువత, మహిళలు ఇతర అర్హులైన పౌరులను ఓటర్లుగా నమోదు చేయడంలో కాంగ్రెస్ పార్టీ లు కీలక పాత్ర పోషించాలని ట్రైనర్లు సూచించారు. ప్రతి బూత్ పరిధిలో అర్హులైన ఒక్క ఓటరు కూడా నమోదు కాకుండా మిగిలిపోకుండా ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో అనేక నియోజకవర్గాల్లో అత్యంత స్వల్ప ఓట్ల తేడాతో గెలుపోటములు నమోదయ్యాయని, పలువురు మాజీ ముఖ్యమంత్రులు సైతం ఓటమిపాలయ్యారని గుర్తు చేశారు. ప్రతి ఓటు ఎన్నికల ఫలితాన్ని నిర్ణయించే శక్తి కలిగి ఉన్నందున లు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అదేవిధంగా లు అప్రమత్తంగా వ్యవహరించకపోతే అర్హులైన ఓటర్ల పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించబడే ప్రమాదం ఉందని, తద్వారా కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా నష్టం జరిగి ఎన్నికల సమయంలో ఇబ్బందులు






ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. అందువల్ల ప్రతి తన బూత్ పరిధిలోని ఓటరు జాబితాను నిరంతరం పరిశీలిస్తూ, ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. టిపిసిసి ఎస్ ఐ ఆర్ ట్రైనింగ్ కమిటీ చైర్మన్‌గా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, బి ఎల్ ఏ లు నాయకులకు ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపడతామని ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దారా సింగ్ గారు పాల్గొన్నారు. అలాగే పరిగి నియోజకవర్గానికి చెందిన 305 బూత్‌ల దీూాలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ రాములు, మండల కార్యవర్గ సభ్యులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పరిగి మున్సిపల్ చైర్మన్ కుడుముల రజిత వెంకటేష్, , అఖిల బాదాం శ్రీనివాస్, రాకంచెర్ల సర్పంచ్ కమ్లి బాయ్ పెంటయ్య, కో ఆప్షన్ సభ్యులు ఆణ్యం ఆంజనేయులు, గండీడ్ మాజీ ఎంపీపీ శాంతిరాగ్యనాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చెరువులో పడి ఇద్దరు చిన్నారులు మృతి. విషాద ఛాయలో తమ తల్లిదండ్రులు గ్రామస్తులు





చిత్తూరు జిల్లా/ బంగారుపాలెం జూన్ 3.: చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం, బి ఎల్ కండ్రిగ సమీపాన పాల్యం తోపు గ్రామానికి చెందిన ఎస్టీ కాలనీకి చెందిన ఒక అమ్మాయి, పిల్లవాడు చెరువులో పడి అకస్మాత్తుగా మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి సత్య వయసు 14 సంవత్సరాలు, తండ్రి లోకేష్, బి ఎల్ కండ్రిగ ఎస్టీ కాలనీ, బంగారుపాళ్యం మండలం (కులము యానాది ఎస్టి ) మరియు ఈమెకు వరసకు తమ్ముడు అయ్యే రోహిత్ వయసు 9 సంవత్సరాలు తండ్రి పవన్ కుమార్, బి ఎల్ కండ్రిగ ఎస్టి కాలనీ, బంగారుపాలెం మండలం అను ఇరువురు కలసి బుధవారం మధ్యాహ్నం 1.00 గంటల ప్రాంతంలో సత్య యొక్క తల్లి అయిన జ్యోతి అను ఆమెతో బట్టలు ఉతకడానికి గ్రామ సమీపమున గల పాలెం తోపు చెరువు వద్దకు తోడుగా వెళ్ళినారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు సత్య మరియు రోహిత్ నీటిలో పడి బురదలో ఇరక్కు పోయి చనిపోయినారు. తల్లి జ్యోతి ఆమెకు ఈత రాకపోవడంతో గట్టిగా అరిచినప్పటికీ అక్కడ చుట్టుపక్కల ఎవరూ రాకపోవడంతో పిల్లలు ఇద్దరు చనిపోయినారు. విషయం తెలిసి చుట్టుపక్కల వారు శవాలను వెలికి తీసి బంగారుపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ డాక్టర్ చనిపోయినట్లు నిర్ధారించినారు. దీనిపై పూర్తి వివరాలు పోలీసు దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

# "జన విశ్వాస్ - సురక్షిత త్రిచక్ర వాహన ప్రయాణాలు" కార్యక్రమంలో బాగంగా, బంగారుపాలెం నందు ఆటోలకు స్టికర్ ల పంపిణీ చేసి అంటించిన బంగారుపాలెం ఇన్స్పెక్టర్ శ్రీ కత్తి శ్రీనివాసులు...





చిత్తూరు జిల్లా/ బంగారుపాళ్యం జూన్ 3.: చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపీస్ ఆదేశాల మేరకు, "జన విశ్వాస్ సురక్షిత త్రిచక్ర వాహన ప్రయాణాలు" ప్రజల భద్రత, మహిళల రక్షణ, నేరాల నివారణ ప్రజలకు సురక్షితమైన వ్యవస్థను అందించేందుకు, ప్రజలతో మరింత సన్నిహిత సంబంధాలను పెంపొందిస్తూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రజల్లో భద్రతాభావం పోలీసు శాఖపై విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ముందడుగు వేసారు. ఈ కార్యక్రమంలో బాగంగా బంగారుపాలెం ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు పాల్గొని బంగారుపాలెం మండలంలోని అన్ని ఆటోలకు స్టికర్ లను ఉదయం 10 గంటలకు అంటించడం జరిగింది. ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలోని ఆటోరిక్షాలకు ప్రత్యేక పోలీసు గుర్తింపు సంఖ్య (యూనిక్యూ పోలీస్ ఐడెంటిఫికేషన్ నెంబర్ ) ప్రత్యేక క్యూఆర్ కోడ్ కలిగిన స్టిక్కర్లను ఆటోలకు అతికించినట్లు, ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా సంబంధిత ఆటో, డ్రైవర్, యజమాని, వాహనానికి సంబంధించిన అధికారిక వివరాలు ఇతర అవసరమైన సమాచారం అధికారులకు తక్షణమే అందుబాటులో ఉండే విధంగా వ్యవస్థను ఎస్పీ తుషార్ డ్యూడి రూపొందించారని తెలిపారు. బంగారుపాలెం మండలంలో 104 ఆటోలను గుర్తించామని, రెండు రోజులలో ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ స్టిక్కర్లను వేయించుకోవాలని, లేనియెడల ఆటో రోడ్డుపై కనబడిన వెంటనే సీజ్ చేయబడుతుందని ఆటో డ్రైవర్లకు సిఐ సూచించారు. ఈ చర్య ద్వారా ప్రయాణికుల భద్రత పెరగడంతో పాటు, నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ ప్రజలకు మరింత నమ్మకమైన రవాణా సేవలు అందించడం సాధ్యమయ్యేలా ఎస్పీ ఈ కార్యక్రమం రూపొందించారని ఇన్స్పెక్టర్ కత్తి శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో రైటర్ రెడ్డప్ప, కానిస్టేబుల్ విజయ్ పాల్గొన్నారు.



# సైకిల్ వాడకంతో ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ

## ఘనంగా ప్రపంచ సైకిల్ దినోత్సవం




శ్రీకాకుళం, మహి న్యూస్, జూన్ 3 : పర్యావరణానికి మేలు చేస్తూ, శారీరక దారుఢ్యానికి ఎంతగానో దోహదపడే సైకిల్ వాడకాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని 'మేరా యువ భారత్' జిల్లా యువజన అధికారి నిమ్మల కృష్ణ పిలుపునిచ్చారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ 'మేరా యువ భారత్' శ్రీకాకుళం విభాగం ఆధ్వర్యంలో బుధవారం నగరంలో ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారీ ర్యాలీ నిర్వహించారు. అరసవిల్లి సాయి ఐటీఐ నుంచి మిల్లు జంక్షన్ వరకు సాగిన ఈ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించేందుకు ఐక్యరాజ్యసమితి 2018 నుంచి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తోందని, ఇది అత్యంత సరసమైన, ఆరోగ్యకరమైన రవాణా సాధనమని పేర్కొన్నారు. చిన్న చిన్న దూరాలకు మోటారు వాహనాలకు ప్రత్యామ్నాయంగా సైకిళ్లను వాడటం వల్ల ఇంధనంతో పాటు డబ్బు కూడా ఆదా అవుతుందని సాయి ఐటీఐ ప్రిన్సిపాల్ జి. సూర్యనారాయణ అన్నారు. అనంతరం యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.వి. అప్పలనాయుడు మాట్లాడుతూ.. రోజుకు గంటపాటు సైకిల్ తొక్కడం వల్ల 300 కేలరీల వరకు శక్తి ఖర్చవుతుందని, ఇది బరువు తగ్గడానికి, మానసిక ఒత్తిడిని దూరం చేయడానికి అద్భుతంగా పనిచేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో 'మేరా యువ భారత్' గణాంకాధికారి డి. శ్రీనివాసరావు, ఐటీఐ ట్రైనర్ జి. తేజేశ్వరరావు, వాలంటీర్లు అరుగుల దిలీప్ కుమార్, ప్రియాంక, మౌనిక, పెద్ద సంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబుతో ఓఎన్‌జీసీ చైర్మన్ మర్యాదపూర్వక భేటీ

## రాష్ట్రంలో ఓఎన్‌జీసీ కార్యకలాపాలపై ఇరువురి మధ్య చర్చ

అమరావతి, మహి న్యూస్, జూన్ 03: ఓఎన్‌జీసీ చైర్మన్ అరుణ్ కుమార్ సింగ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్ర సచివాలయానికి వచ్చిన ఆయన రాష్ట్రంలో ఓఎన్‌జీసీ చేపడుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యకలాపాలపై ముఖ్యమంత్రికి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా- గోదావరి డెల్టా బేసిన్‌లో సహజవాయువు, చమురు అన్వేషణ, వెలికితీత పనుల పురోగతి సహా వివిధ అంశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. రాష్ట్రంలో ఇంధన రంగం అభివృద్ధికి ఓఎన్‌జీసీ చేస్తున్న కృషిని, తదుపరి విస్తరణ ప్రణాళికల గురించి అరుణ్ కుమార్ సింగ్ సీఎంకు వివరించారు. ఓఎన్‌జీసీ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి సమకూరే ఆదాయం, ఉపాధి అవకాశాలు స్థానిక ఆర్థిక వ్యవస్థపై వాటి ప్రభావంపై సీఎం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, ఓఎన్‌జీసీ మధ్య మెరుగైన సమన్వయం ఉండేలా చూడాలని, తద్వారా ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ఇంధన భద్రతను పెంపొందించడానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. సామాజిక బాధ్యతగా ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులను ఆయా గ్రామాల్లో ఖర్చు పెట్టాలని సీఎం సూచించారు. చమురు సహజవాయువు తవ్వకాలు జరుపుతున్న ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఓఎన్‌జీసీ చైర్మన్ కాకినాడ, గుంటూరులో కేన్సర్ చికిత్సల్లో వినియోగించే అధునాతన యంత్రాలను ఆస్పత్రులకు సమకూరుతున్నట్టు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమావేశానికి రాష్ట్ర పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పన శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఓఎన్‌జీసీ అధికారుల బృందం హాజరయ్యారు.

# బాల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

## ఆన్‌లైన్‌లో నామినేషన్ల స్వీకరణ చివరి తేదీ జూలై 31 జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం, మహి న్యూస్, జూన్ 3: జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ - 2027' అవార్డులకు అర్హులైన బాలబాలికల నుంచి దరఖాస్తులు, నామినేషన్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో అసాధారణ ప్రతిభ కనబరిచిన చిన్నారులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పురస్కారాలను అందిస్తోందని, ఇందుకోసం ఆన్‌లైన్ పోర్టల్ ప్రారంభమైందని పేర్కొన్నారు.

**అర్హతలు.. విభాగాలు ఇవే..**

ధైర్యసాహసాలు, సామాజిక సేవ, పర్యావరణ పరిరక్షణ, క్రీడలు,



కళలు-సంస్కృతి, సరికొత్త ఆవిష్కరణలు, విజ్ఞాన శాస్త్రం, సాంకేతికత తదితర రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన బాలలు ఈ అవార్డుకు అర్హులని కలెక్టర్ వివరించారు. 2026 జూలై 31 నాటికి 5 సంవత్సరాలు పూర్తి చేసుకొని, 18 సంవత్సరాల లోపు ఉన్న భారతీయ పౌరులు, దేశంలో నివసిస్తున్న బాలబాలికలు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు విధానం: అర్హులైన బాలుడు లేదా బాలిక స్వయంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ అధికారులు, ఇతర ప్రముఖులు కూడా చిన్నారుల పేర్లను నామినేట్ చేయవచ్చు. ఆసక్తి, అర్హత గలవారు తమ దరఖాస్తులను పూర్తి వివరాలతో అధికారిక వెబ్‌సైట్ https://awards.gov.in ద్వారా మాత్రమే సమర్పించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆన్‌లైన్ నామినేషన్ల సమర్పణకు 2026 జూలై 31 ఆఖరు తేదీ అని తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, శిశు సంరక్షణ కేంద్రాలు ఈ విషయమై విస్తృత ప్రచారం కల్పించి, అర్హులైన ప్రతిభావంతులైన చిన్నారులు దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు.

# హెల్తీ సిటిజన్స్‌తోనే వెల్తీ నేషన్ నిర్మాణం

## ఇంటి దగ్గరకే అత్యుత్తమ వైద్య సేవలు అందించేలా 'సంజీవని'

గుంటూరు, మహి న్యూస్, జూన్ 3: హెల్తీ సిటిజన్సే.. వెల్తీ నేషన్ నిర్మించగలరని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అందుకే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధనలో ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చామని సీఎం తెలిపారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుంటూరు జిల్లాలో పర్యటించారు. లలితా పీవీఎస్ హాస్పటల్‌ను ప్రారంభించి, పరిశీలించారు. 600 పడకలతో అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించిన లలితా ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందించారు. మొత్తంగా 32 విభాగాలకు సంబంధించి ఒకేచోట వైద్య సేవలు అందించేలా ఆస్పత్రిని నిర్మించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. లలిత ఆస్పత్రి ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన సేవలు అందాలని సీఎం ఆకాంక్షించారు. ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ సహా పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ... 'ఆరోగ్యానికి మించిన ఆస్తి ఉండదు. సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నవారే నిజమైన ధనవంతులు. వేల కోట్ల రూపాయలున్నా, భవంతులు ఉన్నా, ఆరోగ్యం లేకపోతే ఉపయోగం లేదు. ప్రభుత్వం త్వరలో సంజీవని ప్రాజెక్టును రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనుంది. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టును చిత్తూరు జిల్లాలో అమలు చేస్తున్నాం. ఇది కంప్లీట్ హెల్త్ కేర్ ప్రోగ్రాం. ప్రతీ ఒక్కరికి డిజిటల్ హెల్త్ రికార్డులు తీసుకొస్తున్నాం. అత్యుత్తమ వైద్య విధానాలను ప్రజల ఇళ్ల దగ్గరకే అందుబాటులోకి తెచ్చేలా సంజీవని పని చేస్తుంది. ప్రిడెక్టివ్, ప్రెవెంటివ్, క్యూరేటివ్ విధానాన్ని అమలు చేస్తున్నాం. 42 రకాల వైద్య పరీక్షలు ఇంటి దగ్గరే చేస్తాం. ఏ మందులు వేసుకోవాలి, ఎప్పుడు ఆసుపత్రులకు రావాలనే అంశాలను కూడా సంజీవని ద్వారా ప్రజలకు గైడ్ చేస్తాం. త్వరలో యూనివర్సిల్ హెల్త్ పాలసీ తీసుకొస్తున్నాం. ఒకొక్కరికి రూ.2.50 లక్షల విలువైన వైద్యం ఉచితంగా అందిస్తాం.' అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

### ఆసుపత్రులకు వెళ్లే పరిస్థితి రాకూడదు

'తినే తిండి, మన పరిసరాలు, మన ఆలోచనా విధానం చాలా ముఖ్యం. ప్రభుత్వం ఎన్ని వైద్య సేవలు అందించినా, ఆసుపత్రులు కట్టినా ప్రజలు సరైన ఆహార నియమాలు పాటించాలి. అప్పుడే అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావు. మంచి అలవాట్లు, ఆహారం, వ్యాయామం ఆరోగ్యానికి పనికొస్తాయి. ఫుడ్ మెడిసిన్... కిచెన్ ఫార్మసీ. మనం తినే ఆహారమే మనల్ని రక్షిస్తుంది. ఒకప్పుడు కావాల్సిన పంటలను ఎరువులు లేకుండా పండించారు. కానీ ఈ రోజు మొత్తం యూరియా వాడుతున్న ఆహారం తీసుకుంటున్నాం. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. తెలిసీ తెలియక ఎక్కువగా క్రిమి సంహారక మందులు వినియోగిస్తున్నారు. గత ప్రభుత్వంలో నాసిరకం మద్యం కారణంగా చాలా మందికి ఆరోగ్య సమస్యలు వచ్చాయి. ప్రజల జీవితాలతో చెలగాటమాడారు.' అని సీఎం చంద్రబాబు చెప్పారు.

### రాష్ట్రంలో అత్యుత్తమ ఆరోగ్య సేవలు అందిస్తాం

'హైదరాబాద్‌లో ఒకప్పుడు నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులతో పాటు ఇతర చిన్న ఆసుపత్రులు మాత్రమే ఉండేవి. హైదరాబాద్‌లో మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు... నాడు హెల్త్ టూరిజాన్ని ప్రమోట్ చేశాం. దేశంలో ఎక్కడి నుంచైనా ఇప్పుడు హైదరాబాద్ వచ్చి ట్రీట్మెంట్ చేయించుకునే పరిస్థితి నెలకొంది. ఏపీని అదే స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం. బెస్ట్ హాస్పటళ్లను రాష్ట్రానికి రప్పిస్తున్నాం. టెక్నాలజీతో వైద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నాం. హైదరాబాద్ తరహాలో వివిధ ప్రాంతాలకు చెందిన వారు... మెరుగైన వైద్య చికిత్సల కోసం అమరావతికి వచ్చేలా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. కార్పొరేట్ ఆస్పత్రుల్లో యోగా శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలి. ప్రజలకు వైద్యారోగ్య సేవలు అందించే విషయంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ చక్కగా పని చేస్తున్నారు. టెక్నాలజీని వైద్యారోగ్య రంగానికి అనుసంధానం చేసేలా సత్యకుమార్ యాదవ్ కృషి చేస్తున్నారు. ఇక లలితా హాస్పటల్స్ ఇక్కడ ఆస్పత్రిని ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయం. హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాల్లో కాకుండా... అమరావతిలో ఆస్పత్రిని నెలకొల్పిన యజమాన్యాన్ని అభినందిస్తున్నాను. దశాబ్దాలుగా వైద్య రంగంలో లలితా గ్రూప్ ఉంది. గుంటూరులో ఇలాంటి అత్యాధునిక ఆసుపత్రిని ప్రారంభించుకోవడం సంతోషకరం. బ్రాండ్ ఎస్టాబ్లిష్ చేస్తే దానికి తిరుగుండదు అనడానికి లలితా ఆసుపత్రి ఒక నిదర్శనం. ప్రజల్లో నమ్మకం, విశ్వసనీయత కలగాలి... అప్పుడే ఏ వ్యవస్థకైనా మనుగడ. ఏడు ఎకరాల్లో 600 పడకలతో లలితా ఆసుపత్రి ఏర్పాటైంది. 32 విభాగాలకు సేవలందించే ఏకైక సెంటర్. కార్డియాలిజీ, న్యూరాలజీ, జాయింట్ రీప్లేస్మెంట్ వంటి సేవలను ఇక్కడ అందిస్తారు. ల్యాండ్ మార్క్ సంస్థగా లలితా ఆసుపత్రి మారుతుంది.' అని ముఖ్యమంత్రి అన్నారు.

# పీఎం కేర్ పిల్లల భవిష్యత్తుకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుంది..

కాకినాడ, మహి న్యూస్, జూన్ 03 : కోవిడ్-19 మహమ్మారి వల్ల తల్లిదండ్రులు ఇద్దరిని కోల్పోయిన పిల్లల భవిష్యత్తుకు ప్రభుత్వంతో పాటు జిల్లా అధికార యంత్రాంగం పూర్తిగా అండగా నిలుస్తుందని కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



భరోసా ఇచ్చారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, మిషన్ వాత్సల్య పథకం జిల్లా బాలల సంరక్షణ విభాగం ద్వారా నిర్వహించిన "పీఎం కేర్స్ లబ్ధిదారుల ముఖాముఖి సమావేశం" లో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీహెచ్.లక్ష్మితో కలిసి లబ్ధిదారులైన




చిన్నారులతో జిల్లా కలెక్టర్ ముచ్చటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చిన్నారులతో వారి చదువు, ఆరోగ్యం, ప్రస్తుతం ఉంటున్న సంరక్షకుల వివరాలు ఇతర యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. పీఎం కేర్ కింద లబ్ధి పొందుతున్న పిల్లలు చిన్ననాటి నుంచే మంచి క్రమశిక్షణ అలవర్చుకుని చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ రకాల ఆర్థిక, విద్యా ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. తద్వారా తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పీఎం కేర్ పిల్లల భవిష్యత్తుకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని, ఏవిధమైన ఇబ్బంది కలిగిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కాకినాడ జిల్లాలో మొత్తం 24 మంది పిల్లలు లబ్ధిపొందుతున్నారని, వీరి సంరక్షణను జిల్లా బాలల సంరక్షణ విభాగం నిరంతరం పర్యవేక్షిస్తోందన్నారు. జిల్లాలో 24 మంది లబ్ధిదారులందరికీ పీఎం కేర్స్ కింద రూ.10 లక్షలు, సీఎం కేర్స్ కింద రూ.10 లక్షలు ఆర్థిక సహాయంతో పాటు, రూ.5 లక్షల విలువ గల ఆయుష్మాన్ భారత్ ఉచిత ఆరోగ్య బీమా కార్డుల సదుపాయం అందుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఐసీడీఎస్ పీడీ సీహెచ్.లక్ష్మి మాట్లాడుతూ.. ఈ పీఎం కేర్స్ పథకం ద్వారా పిల్లలకు 18 ఏళ్ల నుండి నెలవారీ స్టైఫండ్, 23 ఏళ్లకు రూ.10 లక్షల కార్పస్ ఫండ్ తో పాటు ఉచిత కేంద్రీయ విద్యాలయాల ప్రవేశాలు, ఉన్నత విద్యా రుణాలు, వైద్య సహాయం అందుతాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులు, జిల్లా లీడ్ బ్యాంకు అధికారి సీహెచ్ఎస్వీ.ప్రసాద్ తో కలిసి పీఎం కేర్స్ లబ్ధిదారులకు ఆర్థిక అక్షరాస్యత ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ అధికారి సీహెచ్.వెంకటరావు, సీడీపీవో పి.వెంకట లక్ష్మి, వై.లక్ష్మి; పీఓఎన్ఐసీ జె.విజయ్, కౌన్సిలర్ బి.దుర్గా, సోషల్ వర్కర్ ఎస్. చిన్న బాబు, కె. రాంబాబు. ఇతర ఐసీడీఎస్ సిబ్బంది, లబ్ధిదారుల సంరక్షులకు తదితరులు పాల్గొన్నారు.

# టూరిజం హబ్ గా పోలవరం ప్రాజెక్ట్

## స్పిల్ వే కు దిగువన బ్రిడ్జి నిర్మాణానికి షెడ్యూల్. ఏలూరు, కొవ్వూరు, రాజమండ్రిలకు కలుపుతూ హైవే కనెక్టివిటీ



అమరావతి, మహి న్యూస్, జూన్ 3 : 2027 లో వచ్చే గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు ను టూరిజం హబ్ గా రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారని తెలిపారు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. అందుకు తగ్గట్లే లేఅవుట్ ప్లాన్ డిజైన్ తయారు చేసేందుకు 9,900 ఎకరాల విస్తీర్ణంతో లైడార్ సర్వే కూడా పూర్తి చేశామని స్పష్టం చేశారు. బుధవారం అమరావతి సచివాలయంలో పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి నిమ్మల పోలవరం ప్రాజెక్టును ఏలూరు, కొవ్వూరు, రాజమండ్రిలకు జాతీయ రహదారులతో అనుసంధానించేలా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. స్పెల్ వేకి దిగువన బ్రిడ్జి నిర్మాణ పనులకు సంబంధించి డిజైన్స్ అనుమతులు, ఇతర పనుల కోసం షెడ్యూల్ ఇవ్వాలని, ఆ షెడ్యూల్ కు అనుగుణంగా కాలయాపన లేకుండా పనులు చేయాలని అధికారులను, ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. ఇప్పటికే పోలవరం ప్రాజెక్ట్ లో కీలకమైన ఈసిఆర్ఎఫ్ డ్యాం పనులు గ్యాప్-1 లో 45 శాతం, గ్యాప్-2 లో 22 శాతం పూర్తయ్యాయి అని స్పష్టం చేశారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు ఈ ఏడాది ఆగష్టు నాటికి పూర్తి చేసి, అనకాపల్లి వరకు గోదావరి జలాలు తీసుకెళ్తాం అని అన్నారు. ఇంక కుడి, ఎడమ ప్రధాన కాలువల టన్నెల్స్ కనెక్టివిటీల పనులు 90 శాతం పూర్తయ్యాయి తెలిపారు. ఈ సమావేశంలో జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశి భూషణ్ కుమార్, జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, పోలవరం ప్రాజెక్టు ఎస్ఈ రామచంద్ర రావు, మేఘా ఇంజనీరింగ్ సంస్థ జాయింట్ సివోవో అంగర సతీష్ బాబు, డిజిఎం మురళీ, మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పవిత్ర సంగమంలో 'కృష్ణవేణి నదీ నవహారతులు' పునఃప్రారంభం పై ఈవో వి.కె. శీనా నాయక్ క్షేత్రస్థాయి పరిశీలన



విజయవాడ, మహి న్యూస్, జూన్ 01: సనాతన హిందూ ధర్మ ప్రచారం మరియు టెంపుల్ టూరిజం అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంగమం (ఫెర్రీ ఘాట్) వద్ద 'కృష్ణవేణి నదీ నవహారతులు' కార్యక్రమాన్ని ఈనెల 5 నుండి పునఃప్రారంభించడానికి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం సిద్ధమౌతున్న సందర్భంగా - ఏర్పాట్లు గురించి ఈరోజు సాయంత్రం దేవస్థానం ఈవో శీనా నాయక్ ఆధ్వర్యంలో ఆలయ స్థానాచార్యులు మరియు వైదిక కమిటీ, అధికారులు పవిత్ర సంగమం వద్ద హారతుల నిర్వహణకు అవసరమైన వివిధ ఏర్పాట్ల నిమిత్తం దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, దేవస్థానం సహాయ కమిషనర్, వైదిక కమిటీతో కలిసి ఉమ్మడిగా క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు.

# ప్రపంచ సైకిల్ దినోత్సవం సందర్భంగా జిల్లా యువజన కార్యాలయం,మై భారత ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహణ..




కాకినాడ, మహి న్యూస్, జూన్ 03 : భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ మై భారత్ (మై భారత్) జిల్లా యువజన కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్స్ వద్ద సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని కాకినాడ జిల్లా యూత్ ఆఫీసర్ తిర్రి గోపి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత శారీరక దృఢత్వం (ఫిట్‌నెస్) పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. సైకిల్ తొక్కడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేయడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని తెలిపారు. ప్రస్తుతం పెరుగుతున్న ఇంధన ధరలు మరియు భవిష్యత్తులో తలెత్తే ఇంధన కొరతను దృష్టిలో ఉంచుకుని సైకిల్ వినియోగాన్ని, నడకను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ అభివృద్ధికి కూడా తోడ్పడవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి సతీష్ కుమార్, స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌లు, సెట్రాజ్ ప్రతినిధులు, యువత, క్రీడాకారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కిషోరి వికాసం, అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమం పై పిల్లలకు అవగాహన

## కార్యక్రమంలో మండల సిడిపిఓ వినీత శ్రీ.



చిత్తూరు జిల్లా/ బంగారుపాలెం జూన్ 3.: చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం తుంబకుప్పం అంగన్వాడి కేంద్రం నందు కిషోరి వికాసం, అంగన్వాడి పిలుస్తుంది అనే కార్యక్రమం మండల సిడిపిఓ వినిత శ్రీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిడిపిఓ వినిత శ్రీ మాట్లాడుతూ, పిల్లలకు ఆటపాటలతో పాటు మంచి విద్యను అందించాలని అంగనవాడి వర్కర్ విమలాకు సూచించారు. కిషోరి పిల్లలకు అనిమీయ గురించి అవగాహన కల్పించడం జరిగింది. పిల్లలు మంచిగా ఎలా నడుచుకోవాలి అనే దానిపై పిల్లలను ఉద్దేశించి ప్రసంగించారు. చెడు ప్రవర్తనలకు అలవాటు కాకూడదని పిల్లలకు అవగాహన కల్పించారు. తదుపరి సూపర్వైజర్ పామీద బేగం మాట్లాడుతూ, పిల్లలు సత్ప్రవర్తనతో మెలగాలని ఆమె సూచించారు. బాల్య వివాహాలు మరియు కౌమార దశలో గర్భధారణ వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ కవిత, చైల్డ్ వెల్ఫేర్ రాజేంద్ర, రియల్ ఏ ఎన్ జి ఓ రామారావు, అంగన్వాడి వర్కర్స్ విమల, అమృత, మమత, అంగన్వాడి హెల్పర్స్ వరలక్ష్మి, కృష్ణవేణి,భువనేశ్వరి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు





# ఆర్టీఐ బోర్డే వైద్యశాఖ నిర్లక్ష్యానికి నిదర్శనం





నాయుడుపేట, జూన్ 3, మహి న్యూస్: తిరుపతి జిల్లా నాయుడుపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సమాచార హక్కు చట్టం బోర్డుపై తప్పనిసరిగా ప్రదర్శించాల్సిన పౌర సమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి, మొదటి అప్పీల్ అధికారుల వివరాలు లేకపోవడం గతంలో వివాదాస్పదంగా మారింది. ఇటీవల వెలుగులోకి వచ్చిన ఫోటో ఈ అంశాన్ని బహిర్గతం చేసింది. చట్టం రూపుదాల్చుకుని సుమారు 20 సంవత్సరాలు అయినా ఇలాంటి దృశ్యాల ఆధారంగా సమాచార హక్కు చట్టం అమలులో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రజలకు సమాచారం పొందే హక్కు ఉన్నప్పటికీ, సంబంధిత అధికారుల వివరాలు అందుబాటులో లేకపోవడం చట్టం ఉద్దేశానికే విరుద్ధమనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును సమర్థంగా పర్యవేక్షిస్తున్నారా అనే సందేహాలు కూడా ప్రజల్లో తలెత్తుతున్నాయి. క్షేత్రస్థాయిలో తనిఖీలు జరుగుతున్నట్లయితే ఇలాంటి లోపాలు ఎలా కొనసాగుతున్నాయని వైద్యాధికారులను ప్రశ్నిస్తున్నారు. ఆర్టీఐ నిబంధనల అమలుపై వైద్యశాఖ నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తోందన్న ఆరోపణలు రోజురోజుకి పెరుగుతున్నాయి. అంతేకాకుండా తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారితోపాటు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి కూడా చట్టపరంగా కోరిన సమాచారాన్ని దరఖాస్తుదారులకు అందించే క్రమములో పూర్తిస్థాయి వైఫల్యం చెందినట్లు గత ఆర్టిఐ ధరఖాస్తులే నిదర్శనం అని చెప్పవచ్చు. ఇప్పటికే నాయుడుపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నుండి ప్రభుత్వ వైద్య సేవలు ప్రజలకు సరిగా అందడం లేదనే విమర్శలు స్థానికంగా బలంగా వినిపిస్తున్నాయి.

# పదవికి పదును పెడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ



సూళ్ళూరుపేట, జూన్ 3, మహి న్యూస్: సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ తరఫున భారీ మెజారిటీతో గెలుపొందిన ఆమె, నియోజకవర్గంలోని గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని సంబంధిత అధికారులతో చర్చించి, పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులను ఆకస్మికంగా సందర్శిస్తూ సేవల నాణ్యతపై ఆరా తీస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పార్టీలకు అతీతంగా తన వద్దకు వచ్చిన ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ ప్రజాభిమానాన్ని సంపాదించుకుంటున్నారు. ఎమ్మెల్యే పనితీరుపై పార్టీ కార్యకర్తలు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహిళా ప్రజాప్రతినిధిగా సమర్థ నాయకత్వాన్ని ప్రదర్శిస్తున్నారని ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న విజయశ్రీ భవిష్యత్తులో మరింత ఉన్నత రాజకీయ నాయకురాలిగా ఎదగాలని నియోజకవర్గ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ప్రజలతో మమేకమవుతూ పదవికి పదును పెడుతున్న ఎమ్మెల్యేగా ఆమె గుర్తింపు పొందుతున్నారు.

# పత్రాల మాయాజాలంలో రిజిస్ట్రారు ఆఫీస్



## గూడురులో రిజిస్ట్రేషన్ల రగడలు.

## పాత స్టాంపులతో కొత్త రిజిస్ట్రేషన్లు.

గూడూరు, జూన్ 3, మహి న్యూస్: గూడూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మరోసారి వివాదాల కేంద్రంగా మారింది. నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయంటూ కొందరు బాధితులు ఆరోపిస్తున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై గత కొంతకాలంగా ఈ వ్యవహారాలు నడుస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. పాత నాన్ జ్యుడీషియల్ స్టాంపులతో పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని, కుటుంబ సభ్యుల పూర్తి సమ్మతి లేకుండానే రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అనుమతులు ఇస్తున్నారని కొందరు వాపోతున్నారు. ఉమ్మడిగా కలిసి ఉన్న కుటుంబాలలో దీనివల్ల ఆస్తి వివాదాలు మరింత పెరిగి, సమస్యలు తలెత్తుతున్నాయని అంటున్నారు. కాగా రిజిస్ట్రేషన్ శాఖ నిబంధనలు గూడూరుసబ్ రిజిస్ట్రారు కార్యాలయములో క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం బాధితులు ఆర్టీఐ దరఖాస్తులు వేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఆర్టీఐ ద్వారా వెలుగులోకి వచ్చే పత్రాలు పలు కీలక విషయాలను త్వరలో బయటపెట్టే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది.

# వైయస్ఆర్సీపీ ఆధ్వర్యంలో "వెన్నుపోటుకు రెండేళ్లు" శాంతియుత నిరసన కార్యక్రమం



చిత్తూరు జిల్లా/ బంగారుపాలెం జూన్ 3.: చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాలెం మండలంలో సంఘ అధ్యక్షులు ఎంబి కుమార్ రాజా, వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ పాలేరు రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటుకు రెండేళ్లు అనే కార్యక్రమం పై శాంతియుత నిరసన కార్యక్రమం 04-06-2026 వ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు బంగారు పాలెం ఎంబిటీ రోడ్డు నాలుగు రోడ్ల కూడలిలో నిర్వహించనున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ప్రియతమ నాయకుడు ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను నెరవేర్చకుండా, ప్రజలను నిలువునా వంచిస్తూ చంద్రబాబు నాయుడు చేస్తున్న మోసపూరిత పాలనను ఎండగడుతూ, నిరసన కార్యక్రమం చేపట్టనున్న నేపథ్యంలో,ముఖ్య అతిథి గా పూతలపట్టు నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్ విచ్చేయనున్నారు. కావున ఈ కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండల, పంచాయతీకి చెందిన నాయకులు కార్యకర్తలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు అందరు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా మండల కన్వీనర్ పాలేరు రామచంద్రారెడ్డి తెలిపారు.



# మే నెలలో రికార్డు స్థాయిలో 1.21 కోట్ల లడ్డూల విక్రయం

## రోజుకు సగటున 4.08 లక్షల లడ్డూల తయారీ నాణ్యమైన లడ్డూల తయారీకి విశేష కృషి చేస్తున్న టీటీడీ పోటు విభాగం



తిరుమల ,మహి న్యూస్,జూన్ 3: కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనానంతరం భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో స్వీకరించే శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయాలు ఈ ఏడాది మే నెలలో రికార్డు స్థాయికి చేరుకున్నాయి. భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో టీటీడీ లడ్డూ ఉత్పత్తిని కూడా విస్తృతంగా పెంచి, ఎలాంటి కొరత లేకుండా ప్రసాదాలను అందిస్తోంది. ఈ ఏడాది మే నెలలో మొత్తం 1,21,35,528 లడ్డూలు విక్రయమయ్యాయి. గత రెండేళ్లతో పోలిస్తే ఈ ఏడాది లడ్డూల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. 2024 మే నెలలో 1.01 కోట్ల లడ్డూలు విక్రయమవ్వగా, 2025లో 1.10 కోట్లకు పెరిగాయి. ప్రస్తుతం 2026లో 1.21 కోట్లకు పైగా విక్రయాలు నమోదవడం విశేషం.

### రోజుకు 4 లక్షలకుపైగా లడ్డూల తయారీ

శ్రీవారి ప్రసాదాల తయారీలో నాణ్యతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్న టీటీడీ, రోజుకు సగటున 4.08 లక్షల లడ్డూలను తయారు చేస్తోంది. సాధారణ రోజుల్లో 4 లక్షల నుండి 4.5 లక్షల వరకు లడ్డూలు తయారవుతుండగా, ప్రత్యేక సందర్భాల్లో ఉత్పత్తిని మరింత పెంచుతోంది.



### లడ్డూ తయారీకి 68 టన్నుల ముడి పదార్థాల వినియోగం

అత్యంత పవిత్రమైన శ్రీవారి ప్రసాదమైన లడ్డూల తయారీ కోసం రోజువారీగా 68 టన్నులకు పైగా ముడి పదార్థాలను టీటీడీ వినియోగిస్తోంది. లడ్డూ తయారీకి రోజుకు సుమారు 32 టన్నుల చక్కెర, 16 టన్నుల శెనగపిండి, 16 టన్నుల నెయ్యి, 3.5 టన్నుల జీడిపప్పు, 2 టన్నుల ఎండుద్రాక్ష, 400 కిలోల యాలకులు, 800 కిలోల కలకండ వినియోగిస్తున్నారు. ఒక్క చిన్న లడ్డూ తయారీకి సగటున 167 నుండి 170 గ్రాముల ముడి పదార్థాలను ఉపయోగిస్తున్నారు. ఇందులో సుమారు 78 గ్రాముల చక్కెర, 39 గ్రాముల శెనగపిండి, 36 గ్రాముల నెయ్యి, 7 గ్రాముల జీడిపప్పు, 3 గ్రాముల ఎండుద్రాక్ష తదితర పదార్థాలు ఉంటాయి.

### జీఐ గుర్తింపు - ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్

ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన "తిరుపతి లడ్డూ"కు భారత ప్రభుత్వం జియోగ్రాఫికల్ ఇండికేషన్ గుర్తింపును మంజూరు చేసింది. అదేవిధంగా లడ్డూ తయారీ, విక్రయాలకు సంబంధించి ఎఫ్ఎస్-ఎస్ఏఐ లైసెన్స్ కూడా టీటీడీకి లభించింది. దీంతో శ్రీవారి లడ్డూ నాణ్యత, ప్రామాణికత మరింత బలోపేతమైంది.

### అత్యాధునిక సాంకేతికతతో నాణ్యత నియంత్రణ

ప్రసాదాల తయారీలో ఉపయోగించే ముడి పదార్థాల్లో ఎలాంటి మలినాలు లేకుండా చూసేందుకు శ్రీవారి పోటులో రెండు అత్యాధునిక ఏఐ ఆధారిత కలర్ సార్టింగ్ యంత్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ముడి పదార్థాల్లోని మలినాలను తొలగించి అత్యుత్తమ నాణ్యత గల ముడి సరుకులను మాత్రమే వినియోగిస్తున్నారు. అలాగే పోటు విభాగానికి అవసరమైన అన్ని ముడి సరుకులను కొనుగోలు విభాగం సేకరించి, ప్రయోగశాల పరీక్షలు నిర్వహించిన అనంతరమే వినియోగానికి అనుమతిస్తోంది.

### సంప్రదాయ దిట్టం ప్రకారమే తయారీ

శ్రీవారి ప్రసాదాల తయారీలో 1950, 1951 సంవత్సరాల్లో టీటీడీ ఆమోదించిన సంప్రదాయ "దిట్టం" ప్రమాణాలను నేటికీ ఖచ్చితంగా పాటిస్తున్నారు. నిత్య, వార, పక్ష, మాస, నక్షత్ర, సాలకట్ల ఉత్సవాలకు అనుగుణంగా సుమారు 20 రకాల అన్నప్రసాదాలు, 25 రకాల పణ్యారాలను సిద్ధం చేస్తున్నారు.

### 24 గంటలూ నిరంతరాయంగా సేవలు

శ్రీవారి పోటులో రెండు షిఫ్టుల్లో సుమారు 700 మంది శ్రీవైష్ణవ బ్రాహ్మణులు భక్తి శ్రద్ధలతో 24 గంటలూ సేవలందిస్తూ లడ్డూ ప్రసాదాల తయారీలో పాల్గొంటున్నారు. వీరికి టీటీడీ సిబ్బంది, పర్యవేక్షకులు సహకరిస్తున్నారు.

### భారీ మౌలిక సదుపాయాలు

లడ్డూ తయారీ ప్రక్రియలో భాగంగా బూంది పోటు, పడి పోటు, అదనపు పోటు, అంతర్గత పోటు వంటి ప్రత్యేక విభాగాలు పనిచేస్తున్నాయి.

- రోజుకు 15 టన్నుల శెనగపప్పును పిండిగా మార్చే ఫ్లోర్ మిల్
- 2,10, 000 కిలోల సామర్థ్యం గల నెయ్యి నిల్వ ట్యాంకులు
- 30 టన్నుల సామర్థ్యం గల గ్యాస్ ప్లాంట్
- 2 నుండి 7 రోజుల వరకు ముడి సరుకులు నిల్వ ఉంచగల ఉగ్రాణం
- కన్వేయర్ బెల్ట్ వ్యవస్థ ద్వారా బూంది తరలింపు వంటి ఆధునిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి.



### భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు

తిరుమలలోని లడ్డూ కాంప్లెక్స్‌లో 56 కౌంటర్ల ద్వారా మూడు షిఫ్టుల్లో 24 గంటలూ లడ్డూల విక్రయం, పంపిణీ జరుగుతోంది. అదనపు లడ్డూల కొనుగోలు కోసం డిజిటల్ చెల్లింపులతో పనిచేసే కియోస్క్ యంత్రాలను కూడా ఏర్పాటు చేశారు. దర్శనం పొందిన ప్రతి భక్తునికి ఒక లడ్డూను ఉచితంగా అందజేస్తున్నారు.


### ప్రత్యేక రోజులకు భారీ బఫర్ స్టాక్

భక్తుల రద్దీ అధికంగా ఉండే రోజుల్లో ఎలాంటి కొరత రాకుండా 8 లక్షల నుండి 10 లక్షల లడ్డూల వరకు బఫర్ స్టాక్ సిద్ధంగా ఉంచుతున్నారు.

### భక్తుల ప్రశంసలు

ఇటీవలి కాలంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత, రుచి మరింత మెరుగుపడటంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత, సంప్రదాయం, భక్తి భావనల సమ్మేళనంగా నిలిచిన శ్రీవారి లడ్డూ ప్రసాదం తిరుమల మహత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెబుతోంది.

# తోతపూరి మామిడి రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది



అమరావతి, మహి న్యూస్, జూన్ 3: తోతపూరి మామిడి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులకు న్యాయమైన ధర లభించేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. తోతపూరి మామిడి ప్రస్తుత సీజన్ పరిస్థితులు, మామిడి గుజ్జు (పల్ప్) ప్రాసెసింగ్, కొనుగోలు ఏర్పాట్లపై బుధవారం వర్చువల్ విధానంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో విజయవాడలోని క్యాంప్ కార్యాలయం నుండి మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు 78 వేల హెక్టార్లలో తోతపూరి సాగు జరుగుతోందని, ఈ పంటపై వేలాది మంది రైతుల జీవనోపాధి ఆధారపడి ఉందన్నారు. వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఈ ఏడాది కొంత మేర దిగుబడి తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు. గత సీజన్‌లో కోకాకోలా, పార్లే, పెప్సీ వంటి ప్రముఖ పానీయాల సంస్థలు పెద్ద ఎత్తున మామిడి పల్ప్ కొనుగోలు చేయడం ద్వారా రైతులకు మేలు జరిగిందని మంత్రి అభినందించారు. ఈ ఏడాది కూడా గత సంవత్సరం మాదిరిగానే కొనుగోలు ఆర్డర్లు ఇవ్వాలని ఆయా సంస్థలను కోరారు. మామిడి పల్ప్ ప్రాసెసింగ్ యూనిట్లు వ్యాపారుల ద్వారా కాకుండా నేరుగా రైతుల నుంచే పండ్లను కొనుగోలు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తోతపూరి పండ్ల కొనుగోలు విషయంలో రైతుల్లో ఎలాంటి అపోహలు, ఆందోళనలు లేకుండా అధికారులు, సిబ్బంది విస్తృత ప్రచారం చేపట్టాలని మంత్రి సూచించారు. పూర్తిగా పరిపక్వత చెందిన నాణ్యమైన ప్రతి పండును కొనుగోలు చేస్తామని, చివరి పండు వరకు రైతులకు మార్కెట్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పండ్ల నాణ్యత మెరుగుదలకు తోడ్పడే ఫ్రూట్ కవర్ల వినియోగాన్ని విస్తృత స్థాయిలో ప్రోత్సహించాలని తెలిపారు. ఒకేసారి కోతలు చేపట్టడం వల్ల మార్కెట్‌పై ఒత్తిడి పెరిగి ధరలు తగ్గే అవకాశం ఉంటుందని, అందువల్ల దశలవారీగా కోతలు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా అధికారులకు మంత్రి సూచించారు. దీనివల్ల నాణ్యత మెరుగుపడటంతో పాటు రైతులకు మెరుగైన ధర లభిస్తుందని తెలిపారు. తమిళనాడులోని కృష్ణగిరి మార్కెట్‌లో తక్కువ ధరలు నమోదవుతున్న అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తోందని మంత్రి తెలిపారు. ఈ సమస్య పరిష్కారం కోసం తమిళనాడు రాష్ట్ర అధికారులతో చర్చలు జరిపి, మూడు రాష్ట్రాల్లో (ఏపి, తమిళనాడు, కర్ణాటక) సమాన ధరల విధానం అమలుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రస్తుత సీజన్ ముగిసే వరకు జిల్లా యంత్రాంగం పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, కొనుగోళ్లలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. తోతపూరి మామిడి రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ కట్టుబాటుతో పనిచేస్తుందని, రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన ప్రతి చర్యను చేపడుతుందని మంత్రి అచ్చెన్నాయుడు పునరుద్ఘాటించారు.

### విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి పెట్టాలి

ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ దశలవారీ కోతలు, పరిపక్వ పండ్ల కోతపై రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం పల్ప్ ఉత్పత్తికే పరిమితం కాకుండా, మామిడి ఆధారిత విలువ వృద్ధి ఉత్పత్తుల తయారీపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మామిడి తొక్కలు, గింజల వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ అంశాలపై సాంకేతిక అవగాహన కల్పించేందుకు మైసూరులోని సెంట్రల్ ఫుడ్ టెక్నాలజికల్ రీసర్చ్ ఇన్స్టిట్యూట్ సహకారంతో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆరెంజ్ కేటగిరీలో ఉన్న పల్ప్ పరిశ్రమలను గ్రీన్ కేటగిరీలోకి మార్చే అంశాన్ని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పరిశీలిస్తామని వెల్లడించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు 7.80 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నమోదవుతుందని ఉద్యానవన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు వివరించారు. ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా 25 నుంచి 30 శాతం వరకు దిగుబడి తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, ఇతర మామిడి రకాలతో పోలిస్తే తోతపూరి పరిస్థితి మెరుగ్గానే ఉందని పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం 44 మామిడి ప్రాసెసింగ్ యూనిట్లు ఉండగా, వీటిలో 37 యూనిట్లు ఈ సీజన్‌లో కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. వీటి మొత్తం ప్రాసెసింగ్ సామర్థ్యం సుమారు 3.50 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉందని తెలిపారు. ఇప్పటికే 20 యూనిట్లు కార్యకలాపాలు ప్రారంభించగా, వాటిలో 13 యూనిట్లు అల్ఫాన్సో, 7 యూనిట్లు తోతపూరి మామిడి ప్రాసెసింగ్ చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం మార్కెట్లో తోటపూరి మామిడి ధర కిలోకు రూ.7 నుంచి రూ.7.50 మధ్య కొనసాగుతోందన్నారు.

### తోతపూరి రైతులకు అండగా నిలుస్తాం: పరిశ్రమల ప్రతినిధులు

తోతపూరి రైతులకు అండగా నిలుస్తామని పల్ప్ ప్రాసెసింగ్ పరిశ్రమల ప్రతినిధులు మంత్రికి హామీ ఇచ్చారు. ఈ ఏడాది ముందస్తుగానే కొనుగోలు ప్రణాళికలు రూపొందించామని, గత సంవత్సరం మాదిరిగా ఒకేసారి కొనుగోళ్లు జరగకుండా ఎక్కువ రోజులు కొనుగోలు ప్రక్రియ కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతుల నుంచే నేరుగా పండ్లను సేకరించి, పండ్లు వృథా కాకుండా చూస్తామని చెప్పారు. స్థానిక మార్కెట్లో మామిడి ఉత్పత్తులకు డిమాండ్ పెంచేందుకు చర్యలు అవసరమని సూచించారు. గత రెండు మూడు సంవత్సరాలుగా మామిడి పల్ప్ పరిశ్రమ అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. మామిడి జ్యూస్‌ల వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు, తాజా మామిడి పండ్లకు కల్పిస్తున్న ప్రోత్సాహం తరహాలోనే మామిడి పల్ప్‌కు కూడా జాతీయ స్థాయిలో ప్రచారం కల్పించాలని సూచించారు. గత ఏడాది మార్కెట్ డిమాండ్‌ను మించి పల్ప్ ప్రాసెసింగ్ జరగడంతో ప్రస్తుతం భారీ నిల్వలు ఉన్నాయని తెలిపారు. అయినప్పటికీ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సాధ్యమైనంత మేరకు కొనుగోళు చేపట్టేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి, ఉద్యానవన శాఖ డైరెక్టర్, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సీఈఓ, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు, ఉద్యానవన శాఖ అధికారులు, మామిడి పల్ప్ ప్రాసెసర్లు, బాట్లింగ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# దోష రహిత ఓటర్ల జాబితా ధ్యేయంగా సర్..

## జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



చిత్తూరు, మహి న్యూస్, జూన్ 3: ఓటరు జాబితాలో అనర్హులు లేకుండా చూడటం సర్ ప్రక్రియ ప్రాథమిక ఉద్దేశం అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో చిత్తూరు అర్బన్ పరిధిలో సర్ ప్రక్రియ ప్రాథమిక ఉద్దేశం అమలపై సంబంధిత బిఎల్ఓ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూక్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్‌వైజర్ల పాత్ర ముఖ్యం సర్ స్ఫూర్తికి అనుగుణంగా అధికారులు, సిబ్బంది నిబద్ధతతో సేవలందించాలి అని పేర్కొన్నారు ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టతకు ఆరోగ్యకర ఓటర్ల జాబితా కీలకమని, దోష రహిత ఓటర్ల జాబితా లక్ష్యంగా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రణాళికాయుత కృషి జరుగుతోందని పేర్కొన్నారు. ఓటర్ల మ్యాపింగ్ ప్రతి విషయం బి ఎల్ వోలు పారదర్శకంగా మీ విధులను నిర్వర్తించాలని తెలియజేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు సంబంధించి జూన్ 5 నుంచి 14వ తేదీ వరకు సన్నద్ధత కార్యకలాపాలు జరుగుతాయని.. ఆపై జూన్ 15 నుంచి జులై 14 వరకు బీఎల్‌వోల ద్వారా ఇంటింటి సర్వే జరుగుతుందని వివరించారు. అర్హులను ఓటరు జాబితాలో ఉండేలా చేయడంతోపాటు అనర్హులు, మృతులు, శాశ్వతంగా వలసవెళ్లినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల పేర్లు ఉండటం వంటి వారి ఓట్లను తొలగించి స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా లక్ష్యంగా సర్ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందన్నారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) తప్పనిసరిగా ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయాల్సి ఉంటుందన్నారు. సర్వే సమయంలో బీఎల్‌వోలు తమ వద్ద తగినన్ని ఫారం-6, 7, 8 తదితరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం గరిష్టంగా 1000 మంది ఓటర్లకు మాత్రమే పరిమితం కావాలని.. దీన్ని దృష్టిలో ఉంచుకొని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై నిబంధనల ప్రకారం హేతుబద్ధీకరణ జరగాలన్నారు. ?ఈ సమగ్ర సవరణ ప్రక్రియను గడువులోగా, ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా పూర్తి చేయాలని బిఎల్ఓ లను ఆదేశించారు. మరల 15 రోజులకు ఒకసారి బి ఎల్ వో ల తో సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు, 2002 ఓటర్ల జాబితాను మరియు 2025 ఓటర్ల జాబితాను అందుబాటులో ఉంచుకొని మ్యాపింగ్ ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు జిల్లాలో 95%సర్వే కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన డిప్యూటీ తహల్దారులు ప్రతి బూత్ స్థాయి అధికారులతో ప్రతిరోజు సర్వే కార్యక్రమాల అమలపై ఫోన్లో తో మాట్లాడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మార్వో కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రవాణా శాఖ రెవెన్యూ కి సంబంధించిన లక్ష్యాలను సాధించే విధంగా చర్యలు చేపట్టండి

కర్నూలు, మహి న్యూస్, జూన్ 03:- రవాణా శాఖ రెవెన్యూ కి సంబంధించిన లక్ష్యాలను సాధించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి డిటిసి ని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో వివిధ అంశాల పై ఆర్టీసీ, డిటిసి, లీగల్ మెట్రోలాజి, ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రవాణా శాఖ ఆదాయ వనరులు, లక్ష్యాల సాధనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం నిర్దేశించిన రెవెన్యూ లక్ష్యాలను శాఖ సమర్థవంతంగా అమలు చేసి గణనీయమైన వసూళ్లు సాధించిందని, ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా నిర్దేశించిన లక్ష్యాలను సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిటిసి ని ఆదేశించారు.. జిల్లాలో ఆర్టీసీ సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ ఆదాయాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్టీసీ ఆర్ఎం ను ఆదేశించారు. అదే విధంగా ఆర్టీసీ బస్టాండ్ లు శుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్‌లో వినియోగదారులు మోసపోకుండా తూకాలు, కొలతలపై నిరంతర నిఘా ఉంచాలని, అదే విధంగా నిత్యావసర వస్తువులు, పెట్రోల్ బంకులు, షాపింగ్ మాల్స్‌లో తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లీగల్ మెట్రోలాజి వారిని ఆదేశించారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడే కల్తీ వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ స్పష్టం చేశారు. హోటళ్లు, స్వీట్ షాపులు, పచ్చులు, వీధి వ్యాపార కేంద్రాలలో ఆహార నాణ్యతను నిరంతరం తనిఖీ చేయాలని, నిల్వ ఉంచిన రసాయనాలతో కూడిన ఆహార పదార్థాలను విక్రయిస్తే సీజ్ చేయాలని కలెక్టర్ ఫుడ్ సేఫ్టీ అధికారిని ఆదేశించారు. సమావేశంలో డిటిసి శాంతకుమారి, సిపిఓ భారతి, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, ఫుడ్ సేఫ్టీ అధికారి రాజగోపాల్, లీగల్ మెట్రాలజీ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## ముచ్చుమరి-ఓరవకల్ నీటి పైప్‌లైన్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి



నంద్యాల, మహి న్యూస్, జూన్ 03 :- ముచ్చుమర్రి నుంచి ఓర్వకల్ వరకు ఏపీఐఐసీ ఆధ్వర్యంలో చేపడుతున్న నీటి పైప్‌లైన్ ప్రాజెక్టు పనులను నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నందికొట్కూరు మండల పరిధిలో ముచ్చుమరి నుంచి ఓరవకల్ వరకు కొనసాగుతున్న నీటి పైప్‌లైన్ పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ప్రాజెక్టు పనుల పురోగతి, పైప్‌లైన్ ఏర్పాటు, నిర్మాణ నాణ్యత, సాంకేతిక అంశాలు, ఎదురవుతున్న సమస్యలు తదితర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పనుల అమలులో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి దశను పర్యవేక్షిస్తూ ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. ప్రజలకు తాగునీటి సరఫరా మరియు పారిశ్రామిక అవసరాల దృష్ట్యా ఈ ప్రాజెక్టుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని పేర్కొంటూ, పనులను ప్రణాళికాబద్ధంగా నిర్వహించి నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం నందికొట్కూరులో సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పురోగతిపై శాఖల వారీగా సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న పనులను గుర్తించి వాటి పూర్తి కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, ఎలాంటి జాప్యానికి అవకాశం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పైప్‌లైన్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించడంతో పాటు భద్రతా నిబంధనలను కూడా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రాజెక్టు పూర్తయితే సంబంధిత ప్రాంతాలకు నీటి సరఫరా మరింత మెరుగుపడటంతో పాటు పారిశ్రామికాభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు. ముఖ్యంగా ఈ పైప్‌లైన్ ప్రాజెక్టు పనులను వీలైనంత త్వరగా, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి, ఆత్మకూర్ ఆర్డీఓ వెంకట శివ, నందికొట్కూరు తహశీల్దార్ శ్రీనివాసులు తదితరులు కలెక్టర్ వెంట ఉండి పాల్గొన్నారు.

## ప్రజలకు సకాలంలో, నాణ్యమైన సేవలు అందించాలి

### - జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి



నంద్యాల, మహి న్యూస్, జూన్ 03:- ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, వేగవంతంగా అందేలా సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. బుధవారం నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామ సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా సచివాలయంలో నిర్వహిస్తున్న వివిధ సేవలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా గ్రామ ప్రజల అభిప్రాయాలు (పర్సెప్షన్), రీ-సర్వే ప్రక్రియ పురోగతి, పట్టాదార్ పాస్‌బుక్‌ల పంపిణీ స్థితి వంటి అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది హాజరు వివరాలతో పాటు సంబంధిత శాఖల రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. ప్రజలకు అందించే సేవల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. సచివాలయానికి వచ్చే ప్రతి ఒక్కరిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి వారి సమస్యలను ఓర్పుతో వినాలని సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ, వారి అవసరాలను గుర్తించి సేవలను సమర్థవంతంగా అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు సంబంధించిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, నాణ్యతతో సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రజలకు చేరువగా ఉండాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగేలా సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దుకాణాలు సీజ్




కర్నూలు, మహి న్యూస్, జూన్ 3 : నగరంలోని వాణిజ్య దుకాణాల యజమానులు తమ దుకాణాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి దుకాణంలో తప్పనిసరిగా డస్ట్‌బిన్ ఏర్పాటు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. ఈ నిబంధనలను ఉల్లంఘించి పరిసరాలను అపరిశుభ్రంగా ఉంచితే జరిమానాలు విధించడమే కాకుండా ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసి, అవసరమైతే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. బుధవారం నగర పరిధిలోని 44వ జాతీయ రహదారి ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్లు, సుంకేసుల రోడ్డులో పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. జాతీయ రహదారి వెంట పరిశుభ్రతను మెరుగుపరచేందుకు ప్రత్యేక వాహనం, సిబ్బందిని నియమించాలని సిబ్బందిని ఆదేశించారు. సంతోష్ నగర్, బళ్ళారి చౌరస్తా వద్ద ఉన్న టీ దుకాణాల వద్ద డస్ట్‌బిన్ లేకపోవడం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం, ద్విచక్ర వాహనాలు అస్తవ్యస్తంగా పార్క్ చేయడాన్ని గమనించిన కమిషనర్ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జరిమానా విధించాలని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌లను ఆదేశించారు. మరోసారి ఇదే పరిస్థితి పునరావృతమైతే ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసి దుకాణాన్ని సీజ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం.రఘు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు రవి, కుర్మయ్య, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.



## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలి

కర్నూలు, మహి న్యూస్, జూన్ 03: ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు సన్నద్ధత, శాఖల మధ్య సమన్వయం, విపత్తు నిర్వహణ చర్యలపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన క్రైసిస్ మేనేజ్మెంట్ సమావేశంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించి వివిధ శాఖల అధికారులతో సమీక్ష



సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు, ప్రజలు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి శాఖ తమ పరిధిలో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించి వాటి నివారణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.



వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై అవగాహన కల్పించాలని, నీటి వినియోగాన్ని తగ్గించే సాగు విధానాలను ప్రోత్సహించాలని సూచించారు. ఉద్యానవన శాఖ ద్వారా మిల్లెట్స్, పండ్ల తోటల సాగును విస్తరించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సాగునీటి పద్ధతుల అమలులో నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించాలని ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ అధికారులు పశువులకు అవసరమైన మేత నిల్వలను పెంపొందించడంతో పాటు పశుగ్రాస ఉత్పత్తిని ప్రోత్సహించాలని సూచించారు. నీటి కొరత పరిస్థితుల్లో పశుసంపదకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో తగినంత తాగునీటి సదుపాయం కల్పించాలని, గర్భిణీలు, బాలింతలకు హీట్‌వేవ్ ప్రభావాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం అందించే పోషకాహార కిట్లు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన వారికి సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు పైపులైన్లు, తాగునీటి పంపిణీ వ్యవస్థలలో ఉన్న లోపాలను వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు రైతులకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల మరమ్మతులను వెంటనే పూర్తి చేసి వ్యవసాయ అవసరాలకు నిరంతర విద్యుత్ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీటిపారుదల శాఖ అధికారులు జిల్లాలోని 246 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు మరియు ఇతర నీటి వనరుల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువులు, కుంటలు, కాలువలలో అవసరమైన మరమ్మతులు చేపట్టి వర్షపు నీటిని గరిష్ఠంగా నిల్వ చేసుకునే విధంగా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. పౌర సరఫరాల శాఖ అధికారులు రేషన్ కార్డు లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు ఎటువంటి అంతరాయం లేకుండా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజారోగ్య, రెవెన్యూ మరియు ఇతర శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమిష్టిగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి విపత్తు పరిస్థితులు ఎదురైనా నష్టాలను తగ్గించే దిశగా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, సిపివో భారతి, జిల్లా పరిషత్ సీఈవో వెంకట రమణ రెడ్డి, డ్వామ ఏపిడి మాధవి, పశువర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ (ఇన్చార్జి) వసంత లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో వేగవంతంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నాం

కర్నూలు, మహి న్యూస్, జూన్ 3 :- జిల్లాలో వేగవంతంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నాం అని జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ కు వివరించారు. బుధవారం విజయవాడ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్ ) పారదర్శకంగా 45 రోజుల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సిఎస్ కలెక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా సిఎస్ కర్నూలు జిల్లా లో ఎస్ఐఆర్ ప్రక్రియ బాగా జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివరిస్తూ, బి ఎల్ ఓ లకు, ఎన్నికల సిబ్బందికి నియోజకవర్గ వారీగా 2002 ఓటర్ లిస్ట్ ను 2025 ఓటర్ లిస్టు తో సరిపోల్చుకునే ప్రక్రియ పై శిక్షణ ఇచ్చామన్నారు. రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించుకున్నామని, బిఎల్వోలు, బిఎల్ఏ లు సమన్వయంతో పని చేయడం జరిగిందని తెలిపారు. పోలింగ్ స్టేషన్ వారీగా, నియోజకవర్గ వారీగా అప్పుడు - ఇప్పుడు సరిపోల్చుకోవడం




జరిగిందన్నారు. మ్యాపింగ్ ప్రక్రియలో వెనుకబడిన 600 మంది బిఎల్వో లకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం కూడా జరిగిందని తెలిపారు. మిగిలిన 4 లక్షల 85 వేలు ఓటర్లకు సంబంధించి మ్యాపింగ్ ప్రక్రియ 45 రోజుల్లోపు ప్రతి ఇంటికి వెళ్లి నిర్ధారణ చేసి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు.. అనంతరం కలెక్టర్ ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాప్ ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రతిరోజు సమీక్షలు నిర్వహిస్తున్నారని, మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయ్యేల చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లాలో మ్యాపింగ్ ప్రక్రియను 76% పూర్తిచేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్నామని, అలాగే మిగిలిన 24 శాతాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అర్బన్ లో 80 శాతం, రూరల్ లో 90 శాతం మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. 2002 ఓటర్ లిస్ట్ తో 2025 ఓటర్ల జాబితాను సరి పోల్చుతూ క్షుణ్ణంగా పరిశీలించి, మ్యాపింగ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బి ఎల్ వోలు బి ఎల్ ఏ లు సమన్వయంతో పనిచేయాలని, ప్రతిరోజు వీఆర్వో ఏఈఆర్ఓ బిఎల్వోలు సమావేశాలు నిర్వహించుకుని సమీక్షించుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు సమావేశంలో డిఆర్ఓ వెంకటనారాయణమ్మ , కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక ప్రామాణికాలతో నెట్ జీరో హెల్త్ క్యాంపస్ ల ఏర్పాటు కార్యక్రమాన్ని జూన్ 5న నిర్వహించాలి

కర్నూలు, మహి న్యూస్, జూన్ 03 :- రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సాంకేతిక ప్రామాణికాలతో రూపొందించిన నెట్ జీరో హెల్త్ క్యాంపస్ కార్యక్రమాన్ని జూన్ 5న వివిధ రకాల మొక్కలు నాటి నిర్వహించాలి అని జిల్లా కలెక్టర్ ఏ సిరి జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం విజయవాడ నుండి రాష్ట్ర ప్రభుత్వ సెక్రటరీలు నివాస్ , మల్లికార్జున , రోనాల్డ్ , విజయకుమార్ , ముఖ్యమంత్రి కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రద్యుమ్న , పంచాయతీరాజ్ శాఖ సెక్రెటరీ కృష్ణ తేజ లు అన్ని జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5న నిర్వహించ తలపెట్టిన నెట్ జీరో హెల్త్ క్యాంపస్ ల నిర్వహణ కు పలు సూచనలు జారీ చేసి పాటించవలసిందిగా ఆదేశించారు. అనంతరం కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి జిల్లా అధికారులతో టెలి కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రకృతి ఒడిలో విద్యార్థులు సేద తీరేలాగా, పర్యావరణం పై విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించి అందులో వారు బాధ్యత తీసుకునే లాగా చైతన్యపరచాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలోని గురుకుల విద్యాసంస్థలు , సంక్షేమ వసతి గృహాలలో మరియు విద్యా సంస్థలను పర్యావరణమునకు హిత కేంద్రాలుగా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విధంగా సాంకేతిక ప్రామాణికాలతో నెట్ జీరో హెల్త్ క్యాంపస్ కార్యక్రమాన్ని జూన్ 5న మొక్కలు నాటి నిర్వహించాలి అని తెలిపారు. నెట్ జీరో ఎనర్జీ లక్ష్యంతో నెడ్‌క్యాప్ ద్వారా సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు ద్వారా సొంతంగా విద్యుత్ తయారు చేసుకునే చర్యలు , పునరుత్పాదక శక్తి వినియోగాన్ని పెంచాలని సూచించారు. సూర్య గమనం పై ఆధారపడి మియావాకి విధానంలో హైడెన్సిటీ మరియు అల్ట్రా హైడెన్సిటీ ప్లాంటేషన్‌లను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సుమారు 1625 మొక్కలను డి డబ్ల్యు ఎం ఏ గుర్తించిన 13 విద్యా సంస్థలలో అన్ని రకాల మొక్కల తో జూన్ 5న నాటే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందుకు అవసరమైన అన్ని చర్యలు చేయాలని ఆదేశించారు. ఈ ప్రస్తుత చర్యల అనంతరం మిగిలిన ట్రైబల్ వెల్ఫేర్, ఎస్సీ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్ తదితర శాఖలకు చెందిన విద్యాసంస్థల్లో విస్తరింప చేసే పనులు చేపట్టాలని, ప్లాంటేషన్ కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నెట్ జీరో కార్యక్రమాల్లో భాగంగా బయో వేస్ట్, లిక్విడ్ వేస్ట్ ,గ్రీన్ వాటర్ నిర్వహణలో భాగంగా సోక్ పిట్లు, రైన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్లు,గ్రే వాటర్ పిట్ లు , కిచెన్ వేస్ట్ పిట్ లను సాంకేతికంగా నిర్దేశించిన మేరకు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రహరీలు లేని విద్యాసంస్థలకు హార్టికల్చర్ విభాగం ద్వారా బ్యాంబు ఫెన్సింగ్ ఏర్పాటు నిమిత్తం తగు చర్యలు తీసుకోవాలని హార్టికల్చర్ ఏడి రాజకృష్ణ రెడ్డి ని ఆదేశించారు. విద్యా సంస్థల కిచెన్ గార్డెన్ తయారు చేసుకొనుట కు కావలసిన ఆకుకూరలు మరియు అన్ని రకాల కాయగూరల విత్తనాలను నేచర్ ఫార్మింగ్ డిపిఎం మాధురిని అందించవలసిందిగా ఆదేశించారు. రూరల్ లో ఉన్న విద్యాసంస్థల వాటర్ హార్వెస్టింగ్ పిట్ల ఏర్పాటును డ్వామా పిడి , అర్బన్ ప్రాంతంలో ఉన్న విద్యా సంస్థల వాటర్ హార్వెస్టింగ్ పిట్ ల ఏర్పాటును స్థానిక మున్సిపల్ కమిషనర్లు ఏర్పాటు చేయవలసిందిగా ఆదేశించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ సమావేశానికి డ్వామా పీడీ నరసింహారెడ్డి , కర్నూలు మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేష్ , సోషల్ వెల్ఫేర్ అధికారి రాధిక ప్రత్యక్షంగాను , ఏడి హార్టికల్చర్ రాజకృష్ణ రెడ్డి , డిపిఓ భాస్కర్ నెడ్ క్యాప్ డివో వీరేంద్ర మరియు వెల్ఫేర్ హాస్టల్ల అధికారులు ఫోన్ ద్వారా పాల్గొన్నారు.

## విజయ గాథ - నంద్యాల జిల్లా

### జలధార - జలహారతితో పుసులూరు రైతులకు సాగునీటి భరోసా






నంద్యాల జిల్లా, మహి న్యూస్, జూన్ 3 : నంద్యాల జిల్లా నంద్యాల మండలంలోని పుసులూరు గ్రామం ఒక మారుమూల వ్యవసాయ గ్రామం. మండల కేంద్రానికి సుమారు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామానికి రవాణా సౌకర్యాలు పరిమితంగానే ఉన్నాయి. అయితే ఈ గ్రామ ప్రజల జీవనాధారం మాత్రం వ్యవసాయమే. ముఖ్యంగా వరి సాగుపై ఆధారపడిన రైతులు ప్రతి ఏడాది కేసీ కెనాల్ ద్వారా వచ్చే సాగునీటితో 250 నుంచి 350 ఎకరాల వరకు రెండు పంటలు పండిస్తూ జీవనం సాగిస్తున్నారు. పుసులూరు గ్రామంతో పాటు కానాల, మిట్నాల, పాండురంగాపురం గ్రామాల రైతులకు జీవనాడిగా నిలిచింది "పెద్దవంచ కాలువ". కానాల వంచ నుంచి మిట్నాల వంచ వరకు సుమారు రెండున్నర కిలోమీటర్ల పొడవున విస్తరించిన ఈ కాలువ ద్వారా దాదాపు 300 మంది రైతులకు చెందిన 400 నుంచి 500 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందుతుంది. చివరికి ఈ నీరు మిట్నాలలోని శివరామస్వామి కుంటలో చేరి పరిసర ప్రాంతాలకు కూడా ఉపయోగపడుతుంది. అయితే గత కొంతకాలంగా ఈ కాలువలో పూడిక పేరుకుపోవడం, మట్టి, గడ్డి మరియు కలుపు మొక్కలు అధికంగా పెరగడం వల్ల నీటి ప్రవాహం పూర్తిగా దెబ్బతింది. కేసీ కెనాల్ నుంచి విడుదలయ్యే నీరు కాలువ చివరి భాగాలకు చేరకపోవడంతో దిగువ ప్రాంత రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాగునీరు సకాలంలో అందక పంటల దిగుబడులు తగ్గిపోవడం, సాగు వ్యయాలు పెరగడం వంటి సమస్యలు రైతులను ఆందోళనకు గురి చేశాయి. ఈ సమస్యను గుర్తించిన గ్రామ రైతులు, ఉపాధి హామీ పథకం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రైతుల అవసరాన్ని అర్థం చేసుకున్న అధికారులు వెంటనే స్పందించి జలధార - జలహారతి కార్యక్రమం కింద రూ.4.10 లక్షల వ్యయంతో కాలువ పూడికతీత పనులను మంజూరు చేశారు. గత 10 రోజులుగా గ్రామంలో 170 మంది ఉపాధి హామీ కూలీలు ప్రతిరోజూ శ్రమించి కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించారు. కాలువ మొత్తం శుభ్రపరచడంతో నీటి ప్రవాహం తిరిగి పునరుద్ధరించబడింది. ప్రస్తుతం కేసీ కెనాల్ నుంచి వచ్చే నీరు ఎలాంటి ఆటంకం లేకుండా దిగువ ప్రాంత పొలాల వరకు చేరుతోంది. ఈ సందర్భంగా రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ, "గతంలో నీరు మధ్యలోనే ఆగిపోవడంతో మా పొలాలకు సరైన సాగునీరు అందేది కాదు. ఇప్పుడు కాలువ శుభ్రం కావడంతో నీరు సాఫీగా వస్తోంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో మంచి దిగుబడులు వస్తాయని ఆశిస్తున్నాం" అని తెలిపారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, "జలధార - జలహారతి కార్యక్రమం కేవలం పూడికతీత పనులు మాత్రమే కాదు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు జీవం పోసే కార్యక్రమం. సాగునీటి వనరులను పునరుద్ధరించడం ద్వారా రైతులకు స్థిరమైన వ్యవసాయాభివృద్ధి సాధ్యమవుతుంది. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు, వ్యవసాయానికి అవసరమైన మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నాం. ప్రతి నీటి వనరును సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నాం" అని పేర్కొన్నారు. పుసులూరు గ్రామంలో చేపట్టిన ఈ పూడికతీత పనులు రైతుల ఆశలను చిగురింపజేశాయి. ఒకవైపు గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించగా, మరోవైపు వందల ఎకరాలకు సాగునీటి సౌకర్యాన్ని మెరుగుపరిచాయి. జలధార - జలహారతి కార్యక్రమం గ్రామీణాభివృద్ధికి, వ్యవసాయ పురోగతికి ఎలా దోహదపడుతుందో పుసులూరు గ్రామం నేడు ఒక ఆదర్శంగా నిలుస్తోంది.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT # 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYA VIDYALAYA SCHOOL, NEAR NADHYAL CHECKPOST, KURNOOL-518001,KURNOOL DIST, A.P PRINTED AT VSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560.
Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com

RNI : APTEL/25/A0108 www.mahinewsindia.com
మహి న్యూస్
epaper: https://epaper.mahinewsindia.com తెలుగు దినపత్రిక


## వంగిన విద్యుత్ స్తంభాలతో బిక్కుబిక్కుమంటున్న రైతన్నలు..!

### తొండూరులో ప్రమాదకరంగా మారిన కరెంటు పోల్స్

### - అధికారులు స్పందించాలని రైతుల విజ్ఞప్తి



పులివెందుల /తొండూరు మహి న్యూస్ జూన్ 3: తొండూరు మండల పరిధిలో పలు గ్రామాల వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా వంగిపోయి ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, బలమైన గాలుల ప్రభావంతో కొన్ని కరెంటు పోల్స్ ఒకవైపుకు వంగి ప్రమాద హెచ్చరికలా కనిపిస్తున్నాయి. అయినప్పటికీ సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటివరకు చర్యలు చేపట్టకపోవడం రైతులను భయాందోళనలకు గురిచేస్తోంది. పొలాల్లో సాగునీటి కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లకు సంబంధించిన ఈ స్తంభాలు ఎప్పుడైనా కూలిపోయే పరిస్థితిలో ఉన్నాయని రైతులు చెబుతున్నారు. వంగిన స్తంభాల కారణంగా విద్యుత్ తీగలు కూడా కిందకు వాలిపోవడంతో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు ప్రాణభయంతో వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు పొలాలకు ఎక్కువగా వెళ్లాల్సి ఉంటుంది. ఇలాంటి సమయంలో విద్యుత్ స్తంభాలు కూలిపోతే ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వంగిపోయిన స్తంభాలను మార్చి, విద్యుత్ లైన్లను సురక్షితంగా ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. పీవిఎల్ వంగిన విద్యుత్ స్థంభం

## ప్రతి ఓటరు మ్యాపింగ్ పక్కా గా జరగాలి

### బి ఎల్ ఓ లు గ్రామస్థుల సహకారంతో మ్యాపింగ్ చేయండి



వై ఎస్ ఆర్ కడప,మహి న్యూస్ జూన్ 03: ప్రతి ఓటరు మ్యాపింగ్ పక్కా గా జరగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.. మంగళ వారం రాత్రి జిల్లా సచివాలయం లోని బోర్డు నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ ఆర్ ఓ,ఏ ఈ ఆర్ ఓ లతో సమీక్షించారు.. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్



చెరుకూరి మాట్లాడుతూ... జిల్లాలో ఇంటింటా జనగణన,ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని తెలిపారు.. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం అత్యంత ముఖ్యమని తెలిపారు. ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బిఎల్ఓ లకు సమగ్రం గా శిక్షణ ఇచ్చి,క్షేత్రస్థాయిలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలని సూచించారు. కార్పొరేషన్ మరియు మున్సిపాలిటీ పరిధిలో ఓటర్ మ్యాపింగ్ లో రెవెన్యూ శాఖ తో సమన్వయం తో పని చేయాలన్నారు. బి ఎల్ ఓ లకు శిక్షణ ను వెంటనే పూర్తి చేయాలని తెలిపారు.గత మే నెల 01 నుంచి 31 వరకు జరిగిన ఇంటింటా జనగణన నమోదు ప్రక్రియను ప్రభుత్వం జూన్ 06వరకు పొడిగించిందన్నారు.ఈ ఇంటింటా జనగణనపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి జూన్ 06 లోపు వంద శాతం పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ ప్రక్రియ నిమిత్తం క్షేత్రస్థాయి అధికారులు పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలనన్నారు. ఈ సమావేశం లో డి ఆర్ ఓ మల్లికార్జునుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, తదితరులు పాల్గొన్నారు.

## ఆచార్య గిరిధర్‌కు ఉద్యోగుల శుభాకాంక్షలు



ఎచ్చెర్ల, మహి న్యూస్, జూన్ 3: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ గిరిధర్ మద్రాస్‌ను విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. క్యాంపస్ అభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ సంద్ర అమరేంద్ర కుమార్, పరిపాలనా అధికారి డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## జలధార - జలహారతి పనులను వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

### జిల్లాలో 7,143 పనులు గుర్తింపు

శ్రీకాకుళం, మహి న్యూస్, జూన్ 3: జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జలధార - జలహారతి' కార్యక్రమం కింద మంజూరైన పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన వేగవంతం చేసి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జలధార ప్రాజెక్టుల పురోగతిపై డ్వామా, ఇరిగేషన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా పనుల ప్రగతిని ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా జలధార కార్యక్రమం కింద రూ. 24,851.78 లక్షల అంచనా వ్యయంతో మొత్తం 7,143 పనులను గుర్తించడం జరిగిందన్నారు. ఇందులో ఇప్పటివరకు 5,765 పనులకు పరిపాలనా అనుమతులు లభించాయని తెలిపారు. మంజూరైన పనులలో 4,247 పనులు ఇప్పటికే ప్రారంభం కాగా, అందులో 3,428 పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని, 819 పనులు విజయవంతంగా పూర్తయ్యాయని వెల్లడించారు. అయితే, ఇంకా 1,518 పనులు ప్రారంభం కావాల్సి ఉందని, వీటిని ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. వీటితో పాటు జిల్లాలో మెటీరియల్ కాంపోనెంట్ కింద మరో 799 పనులను గుర్తించి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకావాలన్నారు. మండలాల వారీగా ప్రగతిని పరిశీలిస్తూ.. లావేరు, జలుమూరు మండలాలలో అత్యధిక పనులు జరుగుతున్నాయని, మిగిలిన మండలాలు కూడా నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంలో వేగం పెంచాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో కాల్వలు, చెరువుల పూడికతీత పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని, ప్రతి నీటి బొట్టునూ సంరక్షించుకునేలా నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని ఆదేశించారు. పనుల గుర్తింపు, పురోగతి, పూర్తయిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ పోర్టల్‌లో ఫోటోలతో సహా అప్‌లోడ్ చేయాలని డ్వామా పీడీని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే లేదా లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయని అధికారులపై శాఖాపరమైన కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో డ్వామా పీడీ.లవరాజు, ఇరిగేషన్ ఎస్ఈ పొన్నాడ సుధాకర రావు, జడ్పీ సీఈఓ వెంకటరమణ, ఈఈలు, ఎంపీడీఓలు, ఏపీఓలు, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధి వైజ్ఞానిక సాంకేతికవిశ్వ విద్యాలయం


## ఐఐఐటి ప్రవేశాలకు 44,104 దరఖాస్తులు

ఎచ్చెర్ల/శ్రీకాకుళం, మహి న్యూస్, జూన్ 3:- రాజీవ్ గాంధి వైజ్ఞానిక సాంకేతికవిశ్వ విద్యాలయం ఐఐఐటి ఆర్జీయుకెటి పరిధిలోని శ్రీకాకుళం (ఎచ్చెర్ల),ఇడుపులపాయ,నూజివీడు ,ఒంగోలు, ఐఐఐటిలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఆరేళ్ళ ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ కోర్సు ప్రవేశాలకు 44,104 మంది తెలుగు రాష్ట్రాల విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని యూనివర్సిటీ రిజిస్ట్రార్ కౌన్సిలింగ్ కన్వీనర్ ఆచార్య అమరేంద్ర కుమార్ పేర్కొన్నారు. ఈ ఐఐఐటి లో మొత్తం 4400 సీట్లు ఉన్నాయని అన్నారు.పదవ తరగతి మార్కులు ప్రతిపాదిక ఈ క్యాంపస్ సీట్లు కేటాయిస్తామన్నారు.ఈ ప్రవేశాలకు దరఖాస్తు గడువు మే 31 తో ముగిసింది అన్నారు. సెడ్యూల్ ప్రకారం ప్రేవాలుకు ఎంపికైన విద్యార్ధులు జాబితా ఈ 12 న విడుదల చేస్తామన్నారు. ఈ ఐఐఐటిలో ప్రత్యేక కేటగిరిలైన క్రీడలు,ఎన్సీపీ,సైనికా ఉద్యోగులు పిల్లల కోటా కింద దరఖాస్తు చేసుకొన్న 2453 మంది విద్యార్థులుకు ఈ నెల 5,6,8 తేదీల్లో నూజివీడు ఐఐఐటిలో దరఖాస్తులు పరిశీలించి సీట్లు కేటాయిస్తామన్నారు. ఆ మేరకు తేదీల వారిగా ఆయా విభాగాల విద్యార్థులు నూజివీడు ట్రిపుల్ఐటీకి తమ సర్టిఫికెట్ తో హాజరు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం డైరెక్టర్ ఆచార్య గిరిధర్ మద్రాస్, పరిపాలనఅధికారి డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు ఉన్నారు.

## జూన్ 08 నాటికి పూర్తి స్థాయిలో స్మార్ట్ కిచెన్ షెడ్స్ సిద్ధం కావాలి

### మండల ప్రత్యేక అధి కారులు ప్రత్యేక శ్రద్ధ తో పనిచేయండి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



వై ఎస్ ఆర్ కడప,మహి న్యూస్ జూన్ 03: వై ఎస్ ఆర్ కడప జిల్లా లో విన్నూతం గా విద్యార్థులకు నాణ్యమైన,రుచికరమైన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం ను అందించేందుకు ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్స్ నిర్మాణ పనులు జూన్ 08 వ తేదీ నాటికి పూర్తి స్థాయి లో సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, కేఎంసీ కమిషనర్ హెచ్.ఎస్. భావనతో కలిసి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో యూనిక్ గా ఏర్పాటు కానున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్స్ భవన నిర్మాణాల పురోగతి పై... సంబంధిత జిల్లా, క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా



జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..రాష్ట్రం లో ఏ జిల్లా లో లేని విధంగా వై ఎస్ ఆర్ కడప జిల్లా లో అమలు చేస్తున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలుస్తూ...రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని గౌ.రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ప్రకటించడం స్ఫూర్తి దాయకమనన్నారు. జిల్లా లో అన్ని మండలాల లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత శుచిగా, రుచికరంగా అన్ని మండలాల్లోని విద్యార్థులకు అందించేందుకు అన్ని మండలాల్లో జరుగుతున్న స్మార్ట్ కిచెన్ నిర్మాణ పనులు పూర్తి చేసి పూర్తి స్థాయిలో జూన్ 08 నాటికి సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. వేసవి సెలవుల అనంతరం విద్యా సంవత్సరం ప్రారంభం నకు ముందు గానే జిల్లా లో నిర్మాణంలో ఉన్న అన్ని స్మార్ట్ కిచెన్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి నిర్వహణ లోకి తీసుకురావాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా స్మార్ట్ ఫార్మింగ్ ఏర్పాటుకు ఆయా మండలాల్లో సదుపాయాలను సమకూర్చాలని సూచించారు.కిచెన్ గార్డెన్స్, కూరగాయల తోటల పెంపకం, కొనుగోలు సంబందిత అంశాలపై ఎపి సీఎన్ఎఫ్, డీఆర్డీఏ అధికారులు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలన్నారు. జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ కిచెన్ ల వద్ద టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని, షెడ్స్ నిర్మాణ పనులు ఆయా మండలాల్లో వివిధ దశల్లో పురోగతిలో ఉన్న భవనాల పూర్తి లో ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తమదృష్టికితీసుకురావాలన్నారు.స్మార్ట్ కిచెన్ లో ఏర్పాటు చేసే.. (త్రాగునీటి సరఫరా,పవర్ సప్లై, డ్రైనేజ్ వ్యవస్థ),మౌలిక సదుపాయాల పై అంశాల వారీ గా సమీక్షించి... పాఠశాలలకు ఫుడ్ ట్రాన్స్ పోర్టేషన్ కు అవసరమైన వాహనాలు మొదలైన అంశాలపై సమీక్షించారు.స్మార్ట్ కిచెన్ లు జూన్ 08 నాటికి సిద్ధం కావాలని ఈ ప్రక్రియలో ఎక్కడా కూడా జాప్యం జరగకూడదని అధికారులను హెచ్చరించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం ను అందించడం తో పాటు వారు శుభ్రత తోఉండేలా...మరియు భోజన సమయానికి ముందు చేతులు శుభ్రం చేసుకొని భోజనం చేసేలా విద్యార్థులకు ఒక అలవాటు గా మార్చే విధంగా ప్రతి పాఠశాల లో ఒక టీచర్ ఈ అంశం ను పర్యవేక్షణ చేయాలని డి ఈ ఓ ను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో సిపిఓ హజరతయ్య, స్మార్ట్ కిచెన్ల పర్యవేక్షకులు జోయల్ విజయకుమార్,డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మి, పీఆర్ ఎస్ఈ మద్దన్న, డివిఓ శంశుద్దీన్, హౌసింగ్ పీడి రాజరత్నం,ఉద్యాన శాఖ అధికారి రవిచంద్ర బాబు,ఎల్డిఎం జనార్ధనం, నాబార్డు డిడిఎం విజయ్ విహారి,ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ ఏడుకొండలు, విద్యాశాఖ,సమగ్ర శిక్ష అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీ, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్య పరిరక్షణ కు వైద్యులు కట్టుబడి పని చేయండి

### జిల్లా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్ లు ప్రజలకు వైద్య సేవలు సకాలంలో అందించేందుకు అందుబాటు లో ఉండాలి

### వైద్యులు సమయపాలన పాటించాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి




వై ఎస్ ఆర్ కడప,మహి న్యూస్ జూన్ 03: ప్రజారోగ్య పరిరక్షణ కు వైద్యులు కట్టుబడి పని చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని పి జి ఆర్ ఎస్ హాల్ నందు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వైద్య ఆరోగ్య శాఖ చే అమలు అవుతున్న కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ను బలోపేతం చేస్తూ చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు ప్రభుత్వ ఆసుపత్రులలో అనేక మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని, ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవలు పొందేందుకు వచ్చే పేషంట్స్ కు సకాలం లో వైద్యులు అందుబాటు లో ఉండి వైద్య సేవలు అందించడం లో కూడా పూర్తి బాధ్యత, అంకిత భావం తో పనిచేయాలని తెలిపారు.. అలాగే ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేషంట్స్ తో వారి అనారోగ్య సమస్యలను ఓపిక తో విని చిరునవ్వు తో వైద్యసేవలు అందించాలన్నారు. వచ్చిన పేషంట్స్ తో రిసెప్షన్ లోనే మంచి గా మాట్లాడి అనారోగ్య సమస్యలు తెలుసుకోవాలని తెలిపారు. వైద్యులు సమయపాలన పాటించాలని,సెలవులు తీసుకొనేందుకు ముందస్తు గా అనుమతి తీసుకోవడం ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు



అవకాశం ఉంటుందనన్నారు. మెడికల్ ఆఫీసర్స్ వారి పరిధి లో ఉన్న సిబ్బంది తో సమావేశాలు నిర్వహించి చిన్న చిన్న పొరపాట్లు ను సర్దుబాటు చేసుకోవాలని తెలిపారు..అలాగే మెడికల్ ఆఫీసర్స్ వారి పరిధిలో ఉన్న ఆసుపత్రి లో వైద్య సేవలు అందించేలామరియు ఉన్న వైద్య పరికరాలను సక్రమంగా వినియోగించుకునేలా ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రం గా ఉండేలా పర్యవేక్షణ చేసుకోవాలని తెలిపారు.. ప్రభుత్వం వైద్య సేవల పై పాజిటివ్ పర్సెప్షన్ ను పేషంట్స్ నుండి సేకరించడం జరుగుతుందనన్నారు. సంజీవని కార్యక్రమం ను జిల్లా లో అమలు చేసేందుకు ముందుగా ఇందుకు అవసరమైన సదుపాయాల కల్పన తో పాటు వైద్యులందరికీ అవగాహన కల్పిస్తామని,ఈ కార్యక్రమం జిల్లా లో చేపట్టేందుకు వైద్య ఆరోగ్య శాఖ సంసిద్ధం గా ఉండాలని జిల్లా కలెక్టర్ తెలిపారు... సీజనల్ వ్యాధులతో మెడికల్ ఆఫీసర్స్ అప్రమత్తం గా ఉండాలని ఆదేశించారు ఈ సమీక్షా సమావేశం లో



డిఎండహెచ్ఓ డా.నాగరాజు, డిసిహెచ్ఎస్ డా.హిమదేవి, మెడికల్ ఆఫీసర్స్,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రపంచ వేదికపై ఆంధ్రప్రదేశ్ కీర్తి పతాకం రెపరెపలు

అమరావతి, మహి న్యూస్, జూన్ 03: ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పర్యావరణ పురస్కారంగా గుర్తింపు పొందిన 'ఫుడ్ ప్లానెట్ ప్రైజ్--2026' ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం (ఏపీసిఎన్ఎఫ్)కు లభించడం రాష్ట్రానికే కాక దేశానికీ గర్వకారణమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ అరుదైన అంతర్జాతీయ గుర్తింపుతో ప్రకృతి వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, రాష్ట్ర ప్రభుత్వం చూపిన చిత్తశుద్ధి, రైతులు, గ్రామీణ మహిళల అంకితభావంతో కూడిన కృషికి ప్రపంచ వేదికపై లభించిన గౌరవమే ఈ పురస్కారమని మంత్రి వివరించారు. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డును రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులు, గ్రామీణ మహిళలు, ప్రకృతి వ్యవసాయ ఉద్యమానికి అంకితభావంతో పనిచేసిన ప్రతి కార్యకర్తకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. జూన్ 2న స్వీడన్‌లోని బస్తాద్ నగరంలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, రైతు సాధికార సంస్థ (రైఎస్ఎస్) కార్యనిర్వాహణ అధికారి తల్లం విజయ్ కుమార్ పాల్గొని ఈ అవార్డును స్వీకరించారు. ప్రపంచ ఆహార వ్యవస్థలో పర్యావరణ అనుకూల మార్పులకు దోహదపడుతున్న వినూత్న కార్యక్రమాలను గుర్తించి ఈ పురస్కారం అందజేసారని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గనిర్దేశంలో దశాబ్దం క్రితం ప్రారంభమైన ప్రకృతి వ్యవసాయ ఉద్యమం నేడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన అతిపెద్ద వ్యవసాయ పర్యావరణ కార్యక్రమాలలో ఒకటిగా ఎదిగిందని మంత్రి అన్నారు. ప్రకృతి సిద్ధాంతాలకు అనుగుణంగా వ్యవసాయ విధానాలను అమలు చేయడం ద్వారా వాతావరణ మార్పులు, పర్యావరణ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని ఏపీసిఎన్ఎఫ్ నిరూపించిందని



తెలిపారు. ప్రకృతి వ్యవసాయం రైతులకు అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయాన్ని అందించడమే కాకుండా నేల సారాన్ని పెంపొందించడం, జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం, రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించడం వంటి ప్రయోజనాలను అందిస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ నమూనా దేశంలోని 21 రాష్ట్రాలతో పాటు శ్రీలంక, జాంబియా దేశాల్లోనూ అమలవుతుండటం ఆంధ్రప్రదేశ్ రూపొందించిన విధానం ప్రపంచవ్యాప్తంగా ఆచరణీయమని నిరూపిస్తోందని ఆయన చెప్పారు. ముఖ్యంగా మహిళల నాయకత్వం ఈ ఉద్యమ విజయానికి ప్రధాన బలంగా నిలిచిందని వివరించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులైన గ్రామీణ మహిళలు కుటుంబ స్థాయిలో ఆలోచనా విధానంలో మార్పు తీసుకువచ్చి రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు నడిపిస్తున్న 10 వేల మందికిపైగా కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు (సీఆర్పీఎస్) సేవలు అభినందనీయమని తెలిపారు. అలాగే ప్రకృతి వ్యవసాయ శాస్త్రాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్న 1,000 మందికిపైగా రైతు శాస్త్రవేత్తలు, మెంటార్లు, 700 మందికిపైగా రైతు పరిశోధకుల సేవలను ప్రత్యేకంగా గుర్తిస్తున్నామని పేర్కొన్నారు. ఈ విజయ ప్రయాణంలో వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ, క్షేత్రస్థాయి అధికారులు, శాస్త్రవేత్తలు, సిబ్బంది అందించిన సహకారం అమూల్యమని మంత్రి అన్నారు. వ్యవసాయ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, కేఎఫ్‌డబ్ల్యూ (కేఎఫ్డబ్ల్యూ) జర్మన్ బ్యాంక్ అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్, కో-ఇంపాక్ట్ సంస్థలతో పాటు ఈ కార్యక్రమానికి తోడ్పడిన జాతీయ, అంతర్జాతీయ భాగస్వామ్య సంస్థలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ అంతర్జాతీయ గుర్తింపు ద్వారా ప్రకృతి వ్యవసాయ విస్తరణకు కొత్త అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలతో జ్ఞాన మార్పిడి, పరిశోధన భాగస్వామ్యాల విస్తరణ, రైతు శాస్త్రవేత్తలకు మరింత ప్రోత్సాహం, ప్రదర్శన క్షేత్రాల అభివృద్ధి వంటి కార్యక్రమాలకు ఈ అవార్డు బలమైన వేదికగా నిలుస్తుందని మంత్రి తెలిపారు. ఇది కేవలం ఒక పురస్కారం మాత్రమే కాదని, సుస్థిర వ్యవసాయం, రైతు సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ సాధించిన పురోగతికి ప్రపంచం అందించిన గౌరవమని పేర్కొన్నారు. ఈ ఉద్యమాన్ని విశ్వసించి అభివృద్ధికి తోడ్పడిన ప్రతి రైతు, ప్రతి మహిళ, ప్రతి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

## ఈఎస్ఐసీ వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాకుళం, మహి న్యూస్, జూన్ 3: ఉద్యోగుల రాష్ట్ర బీమా సంస్థ (ఈఎస్ఐసీ) పరిధిలోని వైద్య కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి గానూ ఇన్సూర్డ్ పర్సన్స్ (ఐపీ) పిల్లల కోటా కింద ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉప కార్మిక శాఖ కమిషనర్ కె.అజయ్ కార్తికేయ ఒక ప్రకటనలో తెలిపారు. నీట్ (యూజీ)-2026 పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ కోటాకు అర్హులని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 20 ఈఎస్ఐసీ వైద్య కళాశాలల్లో ఐపీ కార్మికుల పిల్లల కోసం 695 ఎంబీబీఎస్, 28 బీడీఎస్, 60 బీఎస్సీ నర్సింగ్ సీట్లు కేటాయించినట్లు వివరించారు. అర్హులైన అభ్యర్థులు 'వార్డ్ ఆఫ్ ఇన్సూర్డ్ పర్సన్' సర్టిఫికెట్ కోసం ఈఎస్ఐసీ అధికారిక వెబ్‌సైట్** (www.esic.gov.in) **ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సర్టిఫికెట్ పొందిన వారు తదుపరి ఆన్‌లైన్ కౌన్సెలింగ్ కోసం ఎంసీసీ వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుందని తెలిపారు. 30.09.2025 నాటికి ఈఎస్ఐసీ సభ్యత్వం కలిగి ఉన్న కార్మికుల పిల్లలు మాత్రమే ఈ ప్రవేశాలకు అర్హులని ఆయన స్పష్టం చేశారు.**

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPADIST, A.PPRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com